
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
ఆదివారం, 17 ఆగస్టు 2025



అబ్బురం.. పగిడేరు భూగర్భం

- వేడినీటి ఊటలు ఉబికివస్తున్న తీరు..
- ఆశ్చర్యపరుస్తున్న కొడిశల కుంట
- నాడు జియోథర్మల్ కేంద్రానికి అంకురార్పణ 6
- ప్రయోగాత్మకంగా 20కిలో వాట్ ఉత్పత్తి కేంద్రం
- పగిడేరును పర్యాటక కేంద్రంగా అభివృద్ధికి సన్నాహాలు
- కలెక్టర్ చొరవతో మారనున్న ప్రాంత రూపురేఖలు

సండే స్పెషల్ SUNDAY SPECIAL

అసలు భూ గర్భం నుంచి నీరు దానంతట అది పైకి ఉబికి రావడమే ఓ వింతయితే.. ఏళ్లుగా.. నిరంతరాయంగా.. అన్ని కాలాల్లో రావడం మరో అద్భుతం. అది కూడా వేడి నీరు. ఈ ఆశ్చర్యకర విషయాలు ఇక్కడి వారికి పాతవే అయినప్పటికీ ఈ ప్రాంతంలో తొలిసారి అడుగు పెట్టే వారికి మాత్రం అబ్బురంగానే కనిపిస్తుంటాయి. భూమిలో నీరేంటి ఎలాంటి మోటారు సాయం లేకుండా నిత్యం పైకి ఉబికి రావడమేమిటని సంభ్రమాశ్చర్యాలకు గురికావాల్సిందే. అది కూడా మసులుతూ చేతితో తాకే వీలు లేనంత వేడిగా ఉండటం అనేది అంతుచిక్కని విషయంగా మిగిలిపోయింది. మణుగూరు మండలంలోగల పగిడేరు పరిసర గ్రామాల్లో వస్తున్న ఈ వేడి నీటి ఊటల ద్వారా 25కిలోవాట్ల జియోథర్మల్ ఉత్పత్తికి కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేసినా.. అది ప్రాథమిక స్థాయిలోనే ఉంది. ఇక ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఇందుకోసం కలెక్టర్ జితేష్ వి పాటిల్ చొరవ చూపుతున్నారు.

- మణుగూరు, ఆంధ్రజ్యోతి

రామయ్య దర్బారు సేవలో

ఆధిపత్య పోరు!

- దివిటీ సలాం సమయంలో అర్ధాంతరంగా పక్కకు తొలగిన హరిదాసు
- విస్తుపోయిన భక్తులు.. పట్టించుకోని దేవస్థానం అధికారులు



దర్బారు సేవ నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలం సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో శనివారం రాత్రి నిత్య కల్యాణ మండపం వద్ద నిర్వహించిన దర్బారు సేవలో దివిటి సలాం సమయంలో ఓ హరిదాసు అర్ధాంతరంగా పక్కకు తొలగడం చర్చనీయాంశమైంది. దివిటి సలాం సమయంలో 'రాజా రామచంద్ర మహాప్రభో బహు పరాక్ బహుపరాక్' అని పలుమార్లు హరిదాసులు ఉచ్ఛరించాల్సి ఉండగా ఒక్కరు మాత్రమే అన్నారు. దేవస్థానంలో ముగ్గురు హరిదాసులు ఉండగా ఇటీవల ఒకరు దర్బారుసేవలో పాడేందుకు ఉత్సాహం చూపడంతో స్థానిక వైదిక పెద్దలు సహకారం అందించారు. ఈ క్రమంలో ఆ ముగ్గురి మధ్య రాగం, శృతి విషయంలో పొంతన కుదరడం లేదన్న విషయంలో అంతర్గతంగా వాదోపవాదాలు సాగుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో శనివారం రాత్రి ముగ్గురూ దర్బారు సేవలో పాల్గొనగా అప్పటి వరకు సాగిన సేవలో కొత్తగా వచ్చిన ఆ ఒక్కరు మైకు తీసుకొని పాడటంతో అప్పటి వరకు పాడుతూ వస్తున్న ఓ హరిదాసు అర్ధాంతరంగా పక్కకు వైదొలగి, అతను ఆలపిస్తున్న సమయంలో మౌనంగా ఉన్నట్టు సమాచారం. నిత్యం దర్బారు సేవను తిలకించే భక్తుల్లో పలువురు.. శనివారం దర్బారు సేవలో జరిగిన ఘటనతో చర్చించుకోవడం కనిపించింది. ప్రపంచంలో ఏ దేవతామూర్తికి లేని అరుదైన దర్బారు సేవ కేవలం దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న రామయ్యకే దక్కింది. నిత్యం రాత్రి సమయంలో నిర్వహించే దర్బారు సేవ రామయ్య దర్పానికి నిదర్శనం. ఇంతటి ప్రాధాన్యమున్న ఈ దర్బారు సేవ సమయంలో ఇద్దరు హరిదాసులు, కొత్తగా వచ్చిన వారితో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాన్ని నిర్వహించాల్సి ఉండగా ఈ విధంగా చేయడం ఎంత వరకు సమంజసమని భక్తులు ప్రశ్నిస్తున్నారు. దర్బారు సేవలో ఇంత జరిగినా దేవస్థానం అధికారులు ఏమీ పట్టనట్టు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. వారి మధ్య ఏదైనా సమస్య ఉంటే సేవ అనంతరం చర్చించుకోవాలి కానీ.. ఇలా బహిరంగంగా ఆధిపత్య పోరుకు దిగడం ఎంత వరకు సమంజసమన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.



ఖమ్మంలో 15 అడుగులు దాటి ప్రవహిస్తున్న మున్నేరు ప్రవాహం

ఆరెంజ్ అలర్ట్!

- జిల్లాకు భారీ నుంచి అతి భారీ వర్ష సూచన
- పొంగిన వాగులు
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- ఖమ్మం వద్ద పెరుగుతున్న మున్నేరు
- అప్రమత్తమైన యంత్రాంగం..
- ముంపు ప్రాంత ప్రజలకు సూచనలు

ఖమ్మం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో రానున్న 24గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షం పడే అవకాశం ఉందంటూ వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్‌ను జారీ చేసింది. ఇప్పటికే మూడురోజులుగా పడుతున్న వానలకు జిల్లాలో పలుచోట్ల వాగులు ఉప్పొంగి.. పలు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఖమ్మం మున్నేరు ఉధృతంగా ప్రవహించడంతో అధికారయంత్రాంగం అప్రమత్తమైంది. శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు జిల్లాలో 27.6మి.మీ. సగటు వర్షపాతం నమోదవగా.. అత్యధికంగా కొణిజర్లలో 70.9మి.మీ, సింగరేణి 61.4మి.మీ, వైరా 55.4మి.మీ, కూసుమంచి 47.8మి.మీ., కామేపల్లి 46.7మి.మీ., ఏన్కూరు 42.0మి.మీ., రఘునాథపాలెం 40.2మి.మీ, ముదిగొండ 33.7మి.మీ., నేలకొండపల్లి 32.3మి.మీ., ఖమ్మంఅర్బన్ 30.8మి.మీ., చొప్పున వర్షం పడింది.

మున్నేరు భయం.. యంత్రాంగం అప్రమత్తం

మున్నేరు, ఆకేరు పరివాహకంలోని మహబూబాబాద్, భద్రాద్రి జిల్లాల్లో అతి భారీ వర్షాలు పడతాయని, రెడ్అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో మున్నేరుకు వరద మరింత పెరుగుతుందన్న ఆందోళన ఇటు ప్రజలు, అటు అధికారుల్లో కనిపిస్తోంది. ప్రస్తుతం ఉన్న వరదకు ఇంకా వరద తోడయితే సమీప కాలనీలు ఈ ఏడాది కూడా ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. ఎగువన మున్నేరు, ఆకేరు పరివాహకంలో కురుస్తున్న భారీవర్షాలతో శనివారం సాయంత్రానికి 15అడుగులకు చేరిన మున్నేరు.. మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి అయిన 16 అడుగులకు చేరువైంది. దీంతో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, పోలీసు కమిషనర్ సునీల్‌దత్ మున్నేరు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించడంతో పాటు అధికార యంత్రాగాన్ని అప్రమత్తం చేశారు. మున్నేరు ముంపు జరిగితే అక్కడి వారిని పునరావాస కేంద్రాలకు తరలించేలా ఏర్పాట్లు చేశారు.

రిజర్వాయర్లు, చెరువులకు జలకళ..

విస్తారంగా పడుతున్న వానలతో జిల్లాలో పాలేరు జలాశయం 23 అడుగులకుగాను 23.25 అడుగులు, వైరా రిజర్వాయర్ 18.3 అడుగులకు 19.8అడుగులు, పెనుబల్లి మండలంలోని లంకాసాగర్ 16అడుగులకు 14.9అడుగులకు చేరి నిండుకుండలను తలపిస్తున్నాయి.ఇక జిల్లాలో 1061చెరువులకుగాను 326 చెరువులు నిండి అలుగులు పారుతున్నాయి. కారేపల్లి మండలంలో బుగ్గవాగు పొంగడంతో గుంపెళ్లగూడెం-మాధారం మధ్య 15 గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. కామేపల్లి మం డలంలో బుగ్గవాగు పొంగడంతో కామేపల్లి-కొత్తలింగాల మధ్య రాకపోకలు నిలిచాయి. ఏన్కూరు-కొణిజర్ల మండలంలో పగిడేరు వాగు, నిమ్మవాగు పొంగడంతో పల్లిపాడు నుంచి ఏన్కూరు వైపు, కొత్తగూడెం, భద్రాచలం వెళ్లే వాహనాలు నిలవడంతో తల్లాడ మీదుగా వెళుతున్నాయి. తల్లాడ మండలంలో మాచవరం, గంగదేవిపాడు వాగు పొంగడంతో నాలుగు గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. కూసుమంచి మండలంలో నర్సింహులగూడెం-కొత్తూరు మధ్య నర్సింహులగూడెం వాగు పొంగడంతో రాకపోకలు నిలిచాయి. జీళ్లచెరువు-చేగొమ్మ మధ్య వాగు పొంగడంతో రాకపోకలు నిలిచాయి.

'మున్నేరు'పై అప్రమత్తంగా ఉండాలి

- పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయండి
- అధికారులంతా మంత్రి తుమ్మల ఆదేశం



ఖమ్మం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భారీవర్షాలు పడి.. మున్నేరుకు వరద పెరిగే అవకాశాలున్నందున జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, ముంపుకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి అక్కడి వారిని పునరావాస కేంద్రాలకు తరలించేలా ఏర్పాట్లు చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో అధికారులను ఆదేశించారు. మున్నేరు వరద పెరుగుతున్న నేపథ్యంలో పరివాహకంలోని 12డివిజనన్లలో ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని, ముందుగానే పునరవాస కేంద్రాలను గుర్తించి వాటిని సిద్ధం చేయాలని, ఎగువన వర్షాలు పడుతున్న తీరు, వస్తున్న వరదను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలని సూచించారు.

తొలి ప్రమాద హెచ్చరికకు

అడుగు దూరంలో..

- ఖమ్మం వద్ద 15 అడుగులకు చేరిన మున్నేరు ప్రవాహం
- సమీప ప్రాంతాల ప్రజలు అప్రమత్తం..
- మున్నేరు వరద ఉధృతిని పరిశీలించిన మేయర్, కలెక్టర్, కమిషనర్ 6



బొక్కలగడ్డలో స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్, కమిషనర్ అగస్త్య



ఖమ్మంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో ఉట్టి కొడుతున్న దృశ్యం

ఘనంగా కృష్ణాష్టమి

- జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పూజలు
- ఉత్సాహంగా ఉట్లు కొట్టిన యువత

ఖమ్మం ఖానాపురం హవేలి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణాష్టమి వేడుకలను జిల్లా వాసులు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. శ్రీకృష్ణ, వేణుగోపాల ఆలయాలతో పాటు పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకృష్ణుడి డోలారోహన వేడుకలు, భజన సంకీర్తనలు నిర్వహించారు. ఖమ్మం మమతారోడ్‌లో ఇస్కాన్ ఆద్వర్యంలో శ్రీకృష్ణ మందిరంలో ఉదయం దర్శన హారతి, మధ్యాహ్నం విద్యార్థులకు ఫ్యాన్సీడ్రస్ పోటీలు, సాయంత్రం అభిషేకాలు, ప్రవచనాలు, రాత్రి మహా ప్రసాదం, అఖండ హరినామ సంకీర్తనలు నిర్వహించారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. నగరంలోని గాంధీచౌక్ శ్రీమురళీకృష్ణ ఆలయంలో, ద్వారకానగర్ శ్రీరాధా సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో, ఖానాపురం శ్రీకృష్ణ మందిరంలోతో పాటు అభయవేంకటేశ్వర స్వామి ఆలయం, బాలాజీనగర్ రామాలయం, తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు, ఉట్టికొట్టే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఉట్టికొట్టే కార్యక్రమంలో యువతీయువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

స్వల్పంగా పెరిగిన గోదావరి

నేడు 40 అడుగులకు చేరే అవకాశం



భద్రాచలం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం స్వల్పంగా పెరిగింది. రెండురోజులుగా స్వల్పంగా పెరుగుతూ వచ్చిన గోదావరి శనివారం రాత్రి 11 గంటలకు 31 అడుగులకు చేరింది. ఇది ఆదివారం సాయంత్రానికి 40 అడుగుల వరకు చేరే అవకాశాలున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా భద్రాచలం వద్ద గోదావరి స్నాన ఘట్టాలు నీట మునగడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీరంలో గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు.

'ఏడుబావుల'లో జన్నారం

యువకుడి గల్లంతు!

జలపాతంలో స్నానం చేస్తుండగా ఘటన

గంగారం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సరదాగా స్నేహితులతో కలిసి మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం ఏడుబావుల జలపాతం వద్దకు వెళ్లిన ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం జన్నారం గ్రామానికి చెందినఓ యువకుడు గల్లంతైనట్టు సమాచారం. ఏన్కూరు మండలం జన్నారం గ్రామానికి చెందిన ప్రేమ్‌కుమార్ (23) తన స్నేహితులతో కలిసి ఏడు బావుల జలపాతాన్ని వీక్షించేందుకు వచ్చాడు. అతడు జలపాతం వద్ద స్నానం చేస్తున్న క్రమంలో గల్లంతైనట్టు సమాచారం. స్నానం అనంతరం ఇంటికి బయల్దేరేందుకు స్నేహితులంతా ఉపక్రమించగా.. ప్రేమ్‌కుమార్ కనపడకపోవడం, కేవలం అతడి దుస్తులు మాత్రమే కనిపించడంతో స్నేహితులు ప్రేమ్‌కుమార్ గల్లంతైనట్టు గంగారం పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో ప్రేమ్‌కుమార్ ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు

పకడ్బందీగా ఉండాలి

- అలసత్వం లేకుండా పనిచేయాలి
- అధికారులకు భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశాలు
- 21న రేవంత్ పర్యటనపై బెండాలపాడులో సమీక్ష



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

చంద్రుగొండ, అగస్టు 16 (అంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించేందుకు గాను ఈనెల 21న సీఎం రేవంత్‌రెడ్డి చంద్రుగొండ మండలం బెండాలపాడు రానున్న నేపథ్యంలో.. ఈ ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఎస్పీ రోహిత్ రాజుతో కలిసి బెండాలపాడులో సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అలసత్వం లేకుండా సమన్వయంతో పని చేయాలని, ముఖ్యంగా భద్రతా చర్యలతో పాటు ముఖ్యమంత్రి ప్రయాణించే ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతులు, విద్యుత్ వైర్లు తొలగింపు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా అగ్నిమాపక, వైద్యం, తాగునీరు తదితర ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇందిరమ్మ లబ్ధిదారులను సీఎం సభకు వచ్చేలా చూసే బాధ్యత ఎంపీడీవోలు, ఏపీఎంలు అప్పగిస్తున్నట్లు తెలిపారు. సీఎం బెండాలపాడు పర్యటన సమయంలో బయట వ్యక్తులు ఎవరూ గ్రామంలోకి రావద్దని, వారిని రాకుండా చూసుకునే బాధ్యతను గ్రామస్థులు, పార్టీ నాయకులు తీసుకోవాలని కోరారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్పీ చంద్రుగొండ, దామరచర్లలో ఏర్పాటు చేస్తున్న హెలీప్యాడ్, బహిరంగ సభ స్థలాన్ని పరిశీలించారు.

సండే స్పెషల్
SUNDAY SPECIAL

అబ్బురం.. పగిడేరు భూగర్భం

ఇక్కడి వేడినీటి ఊటలు ఓ అద్భుతం. ఎలాంటి మోటార్లు లేకుండా వేడినీరు ఉబికిరావడం మణుగూరు మండలంలోని పగిడేరు ప్రాంత ప్రత్యేకత. స్థానిక చరిత్ర ఆధారంగా ఈ ప్రాంతంలో తొలుత ఖమ్మం తోగు బుగ్గ అనే గిరిజన గ్రామాలుండేవి. సింగరేణి ఈ గ్రామాలకు సమీప దూరంలో తమ పనులు మొదలు పెట్టకముందే బుగ్గ గ్రామంలో ఓ కట్ట సమీపంలో చింత చెట్లు, వెదురు చెట్ల కింద కాస్త దూరం దూరంగా రెండు కుంటలు ఉండేవి.. వాటిలో నీరు ఒక్క దానిలో పట్టుకోలేనంత వేడిగా ఉండగా మరో చోటు ఉన్న కుంటలో చల్లని నీరు ఉండేది... స్థానిక గిరిజనులు ఈ ప్రాంతాలను దేవతామూర్తులు నడయాడిన ప్రాంతాలుగా తమ తాతల కాలం నుంచి చెప్పుకుంటుండే వారని తెలిపారు. దాదాపు 100 ఏళ్ల చరిత్ర గల ఈ ప్రాంతాల్లో బుగ్గ గ్రామంలోని ఈ వేడి బుగ్గ, చలి బుగ్గ అనే ప్రాంతాలు గత ఆరేళ్ల నుంచే ప్రాచుర్యంలోకి వచ్చాయి. విచిత్రమేంటంటే అవి వెలుగులోకి వచ్చిన ఈ ఆరేళ్లనుంచి ఈ ప్రాంతంలో నీటికుంటల్లో నీరు రావడం ఆగిపోయింది.

- వేడినీటి ఊటలు ఉబికివస్తున్న తీరు..
- ఆశ్చర్యపరుస్తున్న కొడిశల కుంట
- నాడు జియోథర్మల్ కేంద్రానికి అంకురార్పణ
- ప్రయోగాత్మకంగా 20కిలో వాట్ ఉత్పత్తి కేంద్రం
- పర్యాటక కేంద్రంగా అభివృద్ధికి సన్నాహాలు
- కలెక్టర్ చొరవతో మారనున్న రూపురేఖలు


ప్రస్తుతం ఉన్న జియోథర్మల్ ప్లాంట్ వద్ద కలెక్టర్ (ఫైల్)

మణుగూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్ సంస్థ 1972లో ఇక్కడ యూజీ మైనింగ్‌తో ఆవిర్భవించింది. అండర్ గ్రౌండ్ గనులు, ఓసీ గనుల ఏర్పాటుతో భాగంగా బొగ్గు నిక్షేపాల కోసం చేసిన అన్వేషణల్లో సింగరేణి ఎక్స్‌ప్లోరేషన్ డిపార్టుమెంట్ వారు మణుగూరు మండలంలోని కొండాపురం అటవీ ప్రాంతంతోపాటు పగిడేరు పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లో అక్కడక్కడ డ్రిల్లింగ్ వేశారు. భూమి పొరల్లో లోతుల్లో ఉన్న బొగ్గు జాడను కనుగొన్నారు. ఇందుకోసం భూమిపై పొర నుంచి దాదాపు 1000నుంచి 1500 అడుగుల లోతు వరకు డ్రిల్లింగ్ పనులు చేశారు. నాడు బొగ్గు అన్వేషణల కోసం వేసిన బోరింగ్ డ్రిల్లింగ్ పనులు నీటి ఊటలను బయటికి వచ్చేలా చేశాయి. ఈ నీటిని కాలువల ద్వారా కొంతదూరం వరకు తీసుకెళ్లి చల్లబడిన తర్వాత స్థానిక రైతులు పంటల సాగుకు వాడుతున్నారు.

18 బోరు పాయింట్లలో నడిచేవి ప్రస్తుతం ఎనిమిది

పగిడేరులో సింగరేణి జరిపిన అన్వేషణలో మొత్తం 18 పాయింట్లలో బోర్ డ్రిల్లింగ్ వేసినట్లు తెలిసింది. ఇందులో కాలక్రమేణా భూమి పొరల్లో జరుగుతున్న సర్దుబాట్లతో నేల గుల్లబారి 10 పాయింట్లు పూడి పోయాయి. రాయి ఉన్న ప్రాంతాల్లో, స్థానికులు కేసింగ్ ఏర్పాటు చేసుకోగా.. మిగతా 8పాయింట్లలో నీరు సహజ సిద్ధంగా బయటికి ఉబికి వస్తోంది. శాంతినగర్ గ్రామంలోని బావిబొందల కుంటలో మూడు బోర్లు, కొడిశలకుంట గ్రామంలో 5ఉండగా రెండు పాడవగా.. మూడు నీటిని పోస్తున్నాయి. విప్పకట్ట చెరువులో రెండు బోర్లు పని చేస్తున్నాయి. మిగతావి గ్రామాల శివారు ప్రాంతాల్లో ఉన్నాయి. అయితే ఇటీవల వచ్చిన భూకంపానికి బావిబొందల కుంట ప్రాంతంలోని రెండు బోర్లు, కొడిశల కుంట గ్రామంలో రెండు బోర్లు నీటిని అందించడం మానేశాయని మాజీ సర్పంచ్ తాటి భీక్షం తెలిపారు.

జియో థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు సన్నాహాలు

ఇక్కడ 25 కిలో వాట్ల జియోథర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేసింది. సింగరేణి సంయుక్త సహకారంలో పలువురు కేంద్ర శాస్త్రవేత్తలు ఇక్కడి ప్రాంతాన్ని పరిశీలించి ఇక్కడ థర్మల్ ప్లాంట్ ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు. దేశంలోనే ప్రప్రథమంగా ఈ ప్రాంతంలో ఈ ప్లాంట్ ఏర్పాటుకు సన్నాహాలు మొదలు పెట్టగా.. అది ఇంకా ప్రాథమిక స్థాయిలోనే ఉంది. అయితే ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఇటీవల భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఈ ప్రాంతాన్ని సందర్శించి ఇక్కడ ఉబికి వచ్చే నీటిని పరిశీలించారు. మణుగూరు అశ్వాపురం పినపాక మండలాల్లో అద్భుతమైన ప్రకృతిపరంగా సహజ సిద్ధంగా ప్రాంతాలను గుర్తించి పర్యాటక కేంద్రాలుగా వీటిని తీర్చిదిద్దే పనులకు కార్యరూపాన్ని ఇచ్చారు. దాంతో పాటు జియోథర్మల్ ఉత్పత్తిని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఇక చారిత్రక విశిష్టత గలిగిన పగిడేరులోని ఈ ప్రాంతాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించుకున్నారు. ఉబికి వచ్చే వేడి నీటిని నిల్వచేస్తూ చక్కని తటాకాలను ఏర్పాటు చేసి ఇటు రైతులకు అటు పర్యాటకులు ప్రయోజనాన్ని అందించే లా చర్యలు చేపట్టాలని సిబ్బంకి ఆదేశాలు జారీ చేశారు. వేడి నీటి స్నానాలను ఆచరించేందుకు, అహ్లాదకర పార్కులను ఇక్కడ ఏర్పాటు చేసి జీవ వైవిధ్యం కలిగిన ఈ ప్రాంతాన్ని బయటి ప్రపంచానికి పరిచయడం చేసే సన్నాహాలు ప్రారంభించారు. భవిష్యత్‌లో ఈ ప్రాంతం ఓ విశిష్టమైన పర్యాటక ప్రాంతంగా భాసిల్లబోతోందని స్థానికులు, జిల్లా వాసులు ఆకాంక్ష వ్యక్తం చేస్తున్నారు.

కిన్నెరసాని జలాశయానికి వరద ప్రవాహం

- ఇన్‌ఫ్లో 10 వేల క్యూసెక్కులు
- రెండు గేట్లు ఎత్తి నీరు విడుదల
- గోదావరిలోకి 1.5 టీఎంసీల నీరు


కిన్నెరసాని జలాశయం గేట్లు ఎత్తిన దృశ్యం

పాల్వంచ రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిన్నెరసాని జలాశయానికి ఎగువ ప్రాంతం నుంచి వరద ప్రవాహం భారీగా చేరింది. శనివారం అసలు సామర్థ్యానికి మించి చేరుతుండటంతో డ్యాం అధికారులు రెండు గేట్లు ఎత్తి 10 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. జిల్లాలో విస్తారంగా వర్షాలు కురవడంతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తూ ఎగువ ప్రాంతమైన గుండాల, టేకులపల్లి, కొత్తగూడెం అటవీ ప్రాంతాల నుంచి జలాశయానికి వరద భారీగా చేరింది. 10వేల క్యూసెక్కుల చొప్పున నీరు చేరడంతో అధికారులు వెంటనే రెండు గేట్లు ఎత్తి 10వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. జలాశయం అసలు సామర్థ్యం 407 అడుగులు కాగా నీటి మట్టం 404. 60 అడుగుల మేరకు నిల్వ ఉంచి ఆ పై నీటిని దిగువ ప్రాంతాలకు వదిలారు. 24గంటల్లో కిన్నెరసాని జలాశయం నుంచి 1.5 టీఎంసీల నీరు గోదావరిలో కలిసింది.

కిన్నెరసాని వాగు దాటొద్దని విస్తృత ప్రచారం

కిన్నెరసాని పరీవాహక ప్రాంతాల్లోని 18 గ్రామాల ప్రజలు వాగు దాటవద్దని జలాశయం అధికారులు గ్రామాల్లో హెచ్చరికలు చేస్తూ ప్రచారం నిర్వహించారు. రైతులు వ్యవసాయ మోటార్లను ఒడ్డు ప్రాంతాల్లోకి ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. పాల్వంచ, బూర్గంపాడు మండలాల అధికారులకు నీటి విడుదల సమాచారాన్ని అందచేశారు.

పర్యాటక కేంద్రం మూసివేత

కిన్నెరసాని అభయారణ్య పర్యాటక కేంద్రం గేట్లను శనివారం మూసివేశారు. భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశానుసారం పర్యాటకులు లోపలికి వెళ్లకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు. వర్షాల కారణంగా జిల్లా రెడ్ అలర్ట్ ఉండగా జలాశయాల వైపు పర్యాటకులు వెళ్ల వద్దని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసు, అభయారణ్య పర్యాటక శాఖాధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. కిన్నెరసాని అభయారణ్య పర్యాటక కేంద్రంలో జలాశయం ఉండటంతో గేట్లు ఎత్తిన దృశ్యాలను చూసేందుకు పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివచ్చారు.


మూసిన కిన్నెరసాని పర్యాటక కేంద్రం గేటు

లౌకిక వ్యవస్థను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత

నిజమైన దేశ భక్తులదే..

- మత ఫాసిజాన్ని ప్రజాస్వామ్యవాదులు ప్రతిఘటించాలి
- నాస్తిక సమాజ అధ్యయన తరగతుల్లో రిటైర్డ్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్



మాట్లాడుతున్న రిటైర్డ్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ కలిగిన భారతదేశంలో నిజమైన దేశభక్తులు ముందుకు వచ్చి లౌకిక వ్యవస్థను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఉందని, గత కొన్నేళ్లుగా మత పాసిజం ప్రజల్లోకి చొచ్చుకుపోయిందని ప్రజాస్వామ్యవాదులు తీవ్రంగా ఖండించాల్సిన అవసరం ఏర్పడిందని రిటైర్డ్ ప్రొఫెసర్ విజయ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నాస్తిక సమాజ అధ్యయన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రకృతిలో పరిస్థితులు పరిపక్వతకు వచ్చిన సమయంలో మార్పులు సంభవిస్తాయని, మానవ సమాజంలోను పరిస్థితులు మార్పులు జరిగితే విప్లవాలు వస్తాయన్నారు. కార్మిక వర్గం ఎప్పుడు కార్మికుల శ్రేయస్సు కోసం పోరాటాలు చేస్తున్నాయన్నారు. కమ్యూనిస్టులు దేశ పరిస్థితులకు పరిమితం కాకుండా ప్రపంచ పరిస్థితులను అధ్యయనం చేయాలన్నారు. భౌతికవాదం సమస్యలకు పరిష్కారం చూపుతుందని, భావవాదం సమస్యలు ఎక్కువ చేస్తుందన్నారు. మరో వక్త సీహెచ్ రమేష్ మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథం గురించి వివరించారు.సమాజంలో శాస్త్రీయ దృక్పథంపై అధ్యయనం పెరగాలన్నారు. బీవీ రాఘవులు మాట్లాడుతూ వాస్తవాలు ఆధారంగా ప్రజలు జీవించే విధానం రావాలన్నారు. సమాజంలోకి మార్క్సిజం వెళ్లటం ద్వారా శాస్త్రీయ విధానం పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కన్నెబోయిన అంజయ్య గేయాలను ఆలపించారు. నాయకులు ఆవుల అశోక్, ప్రీతం అధ్యక్షులుగా వ్యవహరించారు. సీహెచ్ రమేష్ బాబు, కోటేశ్వరరావు, చార్వాక సుధాకర్, క్రాంతి, స్టాలిన్, ఝాన్సీ, శోభ పాల్గొన్నారు.

మావోయిస్టుల అడ్డాలో జాతీయ జెండా రెపరెపలు

- 29గ్రామాల్లో ఎగురవేసిన బలగాలు
- భారీ సంఖ్యలో హాజరైన ఆదివాసీలు
- నక్సల్ అడ్డాలో తీవ్రర్ణపతాకం గర్వంగా ఎగిరిందని చత్తీస్‌గఢ్ సీఎం ప్రకటన


బీజాపూర్ అడవుల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

చర్ల, అగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : నక్సల్స్ అడ్డాలో ఉన్న 29గ్రామాల్లో మొదటి సారి జాతీయ జెండా రెపరెపలాడింది. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక బలగాలు త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. దండకారణ్యంలో మొదటి సారి అక్కడి గ్రామస్థులు జాతీయ జెండాను చూశారు. బలగాలు నిర్వహించిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొని జాతీయ గీతాన్ని ఆలపించారు. ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలోని బస్తర్ డివిజన్‌లో ఉన్న సుకుమా, బీజాపూర్, నారాయణపూర్ అడవులు మావోయిస్టులకు కంచుకోటలుగా ఉన్నాయి. ఆయా జిల్లాల్లో మావోయిస్టుల ప్రాబల్యం అధికంగానే ఉంది. కానీ కొద్ది రోజుల నుంచి ఆయా జిల్లాల అడవుల్లో కేంద్ర బలగాలు ప్రత్యేక పోలీస్ క్యాంపులు ఏర్పాటు చేశాయి. ఇదే క్రమంలో శుక్రవారం 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను నారాయణ పూర్ జిల్లాలోని గర్పా, కచ్చపాల్, బెడ్మకొట్టి, కందుల్నార్, రేనార్, బీజాపూర్ జిల్లాలోని కొండపల్లి, జీడిపల్లి, పట్టివాగు, పిడియా, పూజారి కాంకేర్, భీమారం, సుకుమా జిల్లాల్లోని గోమ్‌గూడ, గొల్లకుంట, నుల్‌కటాంగ్, ఉల్కవాయ ఇతర గ్రామాల్లో భద్రతా బలగాలు నిర్వహించాయి. స్థానిక గిరిజనులు, విద్యార్థులు జెండా పండుగలో పాల్గొన్నారు. కాగా గత కొంత కాలంగా అక్కడ గ్రామాల్లో మావోయిస్టులు నల్లజెండాలు ఎగుర వేశారు. నేడు బలగాల రాకతో జాతీయ జెండా రెపరెపలాడుతోందని బస్తర్ పోలీసులు తెలిపారు. అలాగే మావోయిస్టు మావోయిస్టుల అడ్డాలోని 29 గ్రామాల్లో జెండా పండుగ జరిగిందని, స్వాతంత్రం వచ్చిన 78 ఏండ్ల తరువాత బస్తర్ గ్రామాల్లో త్రివర్ణ ప్రతాకం గర్వంగా ఎగిరిందని, ఛత్తీస్‌గడ్ రాష్ట్రం మావోయిస్టు రహిత ప్రాంతంగా కాబోతుందని ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి శనివారం మీడియాకు తెలిపారు.

సింగరేణి ఉద్యోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

- రిటైర్మెంట్ రోజే సీపీఆర్‌ఎంఎస్ కార్డును అందించాలి
- సింగరేణి సీఎండీ బలరాం


ట్రస్టుబోర్డు సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ బలరాం

రుద్రంపూర్, (సింగరేణి) ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులకు మెరుగైన వైద్యసేవలు అందించే విధంగా చర్యలు చేపట్టాలని సింగరేణి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ బలరాం కోరారు. పదవీ విరమణ చేసిన కార్మికులకు వెంటనే కంట్రిబ్యూటరీ పోస్టు రిటైర్‌మెంట్ మెడికేర్ స్కీం (సీపీఆర్‌ఎంఎస్) కార్డులను అందించాలని ఆదేశించారు. శనివారం సీపీఆర్‌ఎంఎస్ ట్రస్టుబోర్డు సమావేశం సింగరేణి ప్రధాన కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది బోర్డుకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, ఆడిట్ తదితర అంశాలపై చర్చించారు. ఆస్పత్రుల్లో వ్యాధి నిర్ధారణ కేంద్రాల్లో సీపీఆర్‌ఎంఎస్ కార్డు ఉన్నవారికి వెంటనే వైద్యసేవలు అందించాలన్నారు. ఉద్యోగులకు సంబంధించిన గ్రాట్యూటీపై చర్చించారు. సింగరేణి సంస్థ ఆమోదించిన ఆస్పత్రుల్లో వైద్యసేవల కోసం వెళ్లిన వారికి ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా చర్యలు చేపట్టాలని సింగరేణి గుర్తింపు కార్మికసంఘం అధ్యక్షుడు సీతారామయ్య కోరారు. సమావేశంలో సింగరేణి డైరెక్టర్ (పా) గౌతమ్‌పోట్రు, డైరెక్టర్లు ఎల్‌వీ.సూర్యనారాయణ, సత్యనారాయణరావు, వెంకటేశ్వర్లు, కార్మికసంఘాల నాయకులు రాజ్‌కుమార్, లక్ష్మీపతిగౌడ్, జనరల్ మేనేజర్లు కవితానాయుడు, జివి.కిరణ్‌కుమార్, మురళీధర్‌రావు, సుబ్బారావు, సీఎంవో రాజ్‌కిరణ్‌కుమార్, ఐఈడీ హెచ్‌వోడీ రవి, కంపెనీ కార్యదర్శి సునీతాదేవి, అధికారులు నారాయణరావు, శివకేశవరావు, హరిప్రసాద్, రమేష్, పాల్గొన్నారు.

తొలిప్రమాద హెచ్చరికకు అడుగు దూరంలో..

- ఖమ్మం వద్ద 15 అడుగులకు చేరిన మున్నేరు
- సమీప ప్రాంతాల ప్రజలు అప్రమత్తం..
- మున్నేరు వరద ఉధృతిని పరిశీలించిన కలెక్టర్




15అడుగులకు చేరిన మున్నేరు, వరద ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్, కమిషనర్ అభిషేక్


మున్నేరు వరదను పరిశీలిస్తున్న మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని మున్నేరు పరివాహక ప్రాంతంలోని ప్రజల్ని ఖమ్మం నగర పాలకం, రెవెన్యూ, పోలీసుశాఖల అధికారులుఅప్రమత్తం చేశారు. ఆదివారం ఉదయంనుంచి గంట గంట కు మున్నేరు నీటి ఉధృతి పెరుగుతుండటంతో ఎగువ ప్రాంతంలోని వర్షాలు, వరదల తీవ్రత నివేదికలను అధికారులు తెప్పించుకున్నారు. ఉదయం 10గంటల నుంచి మున్నేరు వరద పెరుగుతూ వచ్చింది. సాయంత్రం వరకు 14 అడుగులకు చేరింది. అయితే రాత్రివరకు 16 అడుగులకు చెరే అవకాశం ఉందని అధికారులు అంచనాలు వేశారు. దీంతో కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య మున్నేరు పరివాహక ప్రాంతం లో పర్యటించారు. అన్ని విభాగాల అధికారులను అప్రమత్తం చేశారు. మున్నేరు పరివాహక ప్రాంతంలోని బొక్కలగడ్డ, వెంకటేశ్వరనగర్ ప్రాంతాల్లో మైకులతో ప్రచారం ఇంటింటి ప్రచారం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే పునరావాస కేంద్రాలకు వెళ్లేలా సర్దుకోవాలని ప్రచారం చేశారు. కేఎంసీ పంపిణీ చేసిన ప్లాస్టిక్ కవర్లలో అత్యవసర మందులు, ధ్రువపత్రాలు, విలువైన వస్తువులు భద్రపరుచుకొని వాటిని వెంట తెచ్చుకోవాలని మైక్‌లో ప్రచారం చేశారు. సాయంత్రం 6గంటలకు 15 అడుగులకు పైగా వరద పోటు పెరగటంతో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మున్నేరు వరదను పరిశీలించా రు. ముందస్తు చర్యలపై కమిషనర్ అభిషేక్ అగస్త్య, తహసీల్దారు సైదులతో సమీక్షించారు. 16అడుగులకు వరద వస్తే ఎన్ని కుటుంబాలను తరలించాల్సి వస్తుందని, 20 అడుగుల వరకు వరదపై ముందస్తు కార్యాచరణ చేయాలన్నారు. ఈ సందర్భంగా బొక్కలగడ్డలోని ప్రజలతో కలెక్టర్ అనుదీప్ నేరుగా మాట్లాడారు. గతేడాది మున్నేరు వరదల సమయంలో తమ నివాసాలు పూర్తిగా మునిగిపోయాయని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారుల ఆదేశాలను ప్రజలు పాటించాలని, ఎవ్వరికి ఎటువంటి ఇబ్బంది లేకుండా పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరివాహక ప్రాంతంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది రాత్రింబవళ్లు అందుబాటులో ఉంటారన్నారు.

పునరావాస కేంద్రాలు సిద్ధం..

మున్నేరుకు వరద తీవ్రత పెరుగుతుండటంతో ఏ క్షణంలో ఏ పరిస్థితి వచ్చినా సహాయక చర్యలను అందించేందుకు అధికారులు, సిబ్బందిని సిద్ధంగా ఉంచారు ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్‌అగస్త్య. ఏ సమయంలో వరదలు పెరిగినా ప్రజల్ని పునరావాస కేంద్రాలను తరలించేందుకు సన్నద్ధం చేశారు. వార్డు ఆఫీసర్లు, వలంటీర్లుకు నివాసాల వారీగా జాబితాలను అందించారు. వలంటీర్లకు మైక్‌లు, ప్రత్యేక కిట్లు అందించారు. రామన్నపేట హైస్కూల్‌లో 1,000, దానవాయిగూడెం ఫంక్షన్ హాలులో 300మంది, నయాబజార్ కళాశాలలో 5వేల మంది, ప్రభుత్వ మహిళా డిగ్రీకాలేజీలో 3వేల మంది, స్వర్ణభారతి కల్యాణ మండపంలో 500మంది, ప్రకాశ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో 300మంది, ధంసలాపురం అంగన్వాడీ పాఠశాలలో 500మంది బాధితులు ఆశ్రయం పొందేలా ఏర్పాట్లు చేశారు. పునరావాస కేంద్రాల పర్యవేక్షణ బాధ్యతను ఈఈ కృష్ణలాల్‌కు కేటాయిస్తూనే ప్రతీ కేంద్రానికి ఒక ప్రత్యేకాధికారి నియమించారు.

వరదను పరిశీలించిన మేయర్

మున్నేరు వరద పరిస్థితిని శనివారం రాత్రి బొక్కలగడ్డ ప్రాంతంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ పరిశీలించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే ప్రజల్ని పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆమె ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. అసిస్టెంట్ కమిషనర్ అనిల్, తహసీల్దార్ సైదులుతో మాట్లాడి.. ఎగువ ప్రాంతం నుంచి వరద గురించి ఆరా తీశారు. విధుల్లో ఉన్న కేఎంసీ ఉద్యోగులు వివరాలను తెలుసుకున్నారు. జవాన్లు మున్నేరు పరివాహక ప్రాంతంలోనే ఉండాలని ఆదేశించారు. వరద తీవ్రత పెరిగితే పునరావాస కేంద్రాలకు ప్రజల్ని తరలించాలని, ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఆమె వెంట కాంగ్రెస్ నాయకులు కన్నం ప్రసన్నకృష్ణ, షేక్ రజీ, జానీ, లింగస్వామి, బొజేడ్ల సత్యనారాయణ, జాకీర్, సాయికిరణ్, మరాటి రమేశ్, నాళం గోపీ, నాగరాజు పాల్గొన్నారు.



పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న కృష్ణలాల్, తదితరులు


మైక్‌లో ప్రచారం చేస్తున్న కేఎంసీ ఉద్యోగులు

కొత్తగూడెం ప్రభుత్వ నర్సింగ్ కళాశాల వేరే చోటుకి మార్పు

- ఇకపై ఒకే చోట బోధన, వసతి సౌకర్యాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



సామాగ్రిని గ్రౌండ్ ఫ్లోర్‌కు తీసుకువస్తున్న విద్యార్థినిలు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం ప్రభుత్వ నర్సింగ్ కళాశాల సమస్యలు ఎట్టకేలకు పరిష్కారించే దిశ చర్యలు మొదలయ్యాయి. ఇటీవల ఈ నెల 6వ తేదీన ఆంధ్రజ్యోతి దిన పత్రికలో కిరాయి కష్టాలు అనే కథనం ప్రచురితమై నర్సింగ్ కళాశాలలో సమస్యలు బహిర్గతమయ్యాయి. అందుకు స్పందించిన కళాశాల ప్రిన్సిపాల్, తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ నర్సింగ్ - కాళోజి నారాయణరావు(కెఎన్ఆర్) యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్స్, డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డిఎమ్ఈ), ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్(ఐఎన్‌జి)ప్రతినిధులకు కళాశాలలో నెలకొన్న సమస్యలను తెలియజేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో కొత్తగూడెం పట్టణంలోని రామాటాకీస్ ఏరియాలో 2022 ఏడాది నుంచి అద్దె భవనంలో కొనసాగుతున్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాల చుంచుపల్లి మండలంలోని డివిజన ఐటీఐ కళాశాల కోసం నిర్మించిన భవనంలోనికి సామాగ్రిని తరలించేందుకు చర్యలు ప్రారంభించారు. ఇప్పటికే మూడు బ్యాచ్‌లకు చెందిన 180 మంది విద్యార్థినిలు నర్సింగ్ విద్యను అభ్యసిస్తున్నారు. ఈ ఏడాది నవంబర్ నెలలో నాల్గొవ బ్యాచ్ రానున్నది. ప్రస్తుతం కొనసాగుతున్న అద్దె భవనంలో నాలుగు బ్యాచ్‌లకు సంబంధించిన పాఠ్యాంశ తరగతులు నిర్వహించే అవకాశాలు కన్పించకపోవడంతో వేరే భవనంలోనికి బదిలీ చేస్తున్నారు.

ఇక బోధన, వసతి ఒకే చోట..

చుంచుపల్లి మండలంలోని విద్యానగర్ కాలనీలో బైపాస్ రోడ్డుకు ఆనుకొని ఉన్న చుంచుపల్లి తండాలో నిర్మించి నిరుపయోగంగా ఉన్న తెలంగాణ గిరిజన ఐటీఐ భవనంలోనికి కొత్తగూడెం ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను మార్చారు. దీంతో కళాశాలలో నర్సింగ్ విద్యనభ్యసించే విద్యార్థినిలకు ఒకే చోట బోధన, వసతి సౌకర్యాలు చేయనున్నారు. కేవలం ప్రాక్టికల్స్‌కు మాత్రమే కొత్తగూడెం సర్వజన (జిజిహెచ్)కు వెళ్ళనున్నారు. ఒకే చోట వసతి, బోధన ఏర్పాటు చేయడంతో విద్యార్థినిలు హర్షం వ్యక్తం చేశారు. గతంలో అద్దె భవనంలో పాఠ్యాంశ తరగతులు.. రైతు వేదిక ప్రాంతంలో వసతి.. జిజిహెచ్‌లో ప్రాక్టికల్స్‌కు కాలినడక ఇబ్బందులకు తెరపడింది.

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా వాలీబాల్ జట్లు


వాలీబాల్ ఎంపికలో పాల్గొన్న క్రీడాకారులు

పాల్వంచ రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): : రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా స్థాయి జట్లు శనివారం మండలంలోని కిన్నెరసాని క్రీడల పాఠశాల మైదానంలో ఎంపిక నిర్వహించారు. ఇక్కడ ప్రతిభను చూపిన క్రీడాకారులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఈ నెల 18 నుంచి 19 వరకు సరూర్ నగర్‌లో రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నాయి. ఈ ఎంపికల్లో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి అండర్ - 15 బాలురు, బాలికలు విభాగాల నుంచి 150మంది క్రీడాకారులు పాల్గొన్నారు. క్రీడాకారుల్లో నైపుణ్యత కలిగిన వారిని గుర్తించి రెండు జట్లుగా ఎంపిక చేశారు. ఒక్కొక్క జట్టులో 9మంది క్రీడాకారుల చొప్పున తీసుకోవడం జరిగింది. ఈ ఎంపిక కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి నాగలక్ష్మి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ వాసిరెడ్డి నరేష్, పీడీలు వేణుగోపాల్, వెంకట నారాయణ, కవిత, కృష్ణ, సుబ్రమణ్యం, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య రహిత సమాజాన్ని సృష్టిద్దాం

» సైకిల్‌పై 5వేల కిలోమీటర్లు ప్రయాణం చేసిన యూట్యూబర్ » ఆల్‌ఇండియా రైడ్‌లో సత్తుపల్లికి చేరుకున్న రాజ్‌కుమార్



సత్తుపల్లిరూరల్, ఆగస్టు16 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి కాలుష్య రహిత సమాజాన్ని సృష్టిద్దామనే నినాదంతో ముందుకు వెళ్దామని యూట్యూబర్ కుంజా రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం ఆంధ్రాలోని జంగారెడ్డిగూడెం మీదుగా తెలంగాణలోని అశ్వారావుపేట నుంచి సత్తుపల్లి చేరుకున్న రాజ్‌కుమార్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైలవరం గ్రామవాసి. మూడు నెలల క్రితం ఇంటి నుంచి సైకిల్‌పై బయల్దేరిన రాజ్‌కుమార్ ఆయా రాష్ట్రాలలలోని అరకు, అయోధ్య, ప్రయాగ్‌రాజ్ తదితర ప్రాంతాల మీదుగా ఢిల్లీ వెళ్లి తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి వెళ్తూ సత్తుపల్లికి చేరుకున్నారు. ముఖ్యంగా కొండలు, కోనలల్లో అటవీ ప్రాంతాల్లో గిరిజనులకు నీటి వసతి లేకపోవడంతో గుంతలు తీసుకుని చెలమలలో నీటిని తాగుతున్నారని, అందుకే అన్ని వసతి సౌకర్యాలతో పాటు విద్యావైద్యం సదుపాయాలను కల్పించాలని ప్రభుత్వాలను కోరుతున్నాడు. అదేవిధంగా పరిశ్రమల రాకతో పట్టణ ప్రాంతాలలో నీడ కాదుకదా చెట్లు లేకుండా పోతున్నాయని, ఇలాగే నరుక్కుంటూ పోతే భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందని, వనజీవి రామయ్య స్ఫూర్తితో మొక్కలు నాటాలనే ఉద్దేశ్యంతో ఆల్‌ఇండియా రైడ్‌ను సైకిల్‌పై చేపడుతున్నానని చెప్పారు. తనవంతుగా ప్రతిఒక్క మొక్కలు నాటి భవిష్యత్ తరాలకు పచ్చదనాన్ని పంచాలనే ఉద్దేశ్యంతో తన పర్యటన సాగిందని చెప్పారు. యువత కూడా స్ఫూర్తిగా తీసుకుని మంచి నడవడికతో సాగుతూ మొక్కలు నాటి వనాలను సృష్టించాలని, ప్రభుత్వాలు సైతం సామాన్యులకు విద్యవైద్య, మౌళిక వసతులు కల్పిస్తూ వారి అభివృద్ధికి తోడ్పాటునందించాలని రాజ్‌కుమార్ కోరుతున్నారు.

కలుపుమందు కాదు.. పరిష్కారం



» కూలీలు అందుబాటులో లేక వినియోగిస్తున్న రైతులు » వాడకంపై పెరుగుతున్న వ్యతిరేకత » బలవన్మరణాలకూ కారణమవుతోందని ఆవేదన

పాల్వంచ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పంట పొలాల్లో కలుపును నివారించే క్రమంలో రైతులు కొరతను అధిగమించేందుకు కలుపుమందు పిచికారీని ఓ మార్గంగా ఎంచుకున్నారు. కానీ ఇదే కలుపు మందును జీవితంపై విరక్తి చెందినవారో.. క్షణికావేశానికి గురైన వారో బలవన్మరణానికి ఆయుధంగా వాడుతున్నారు. దీంతో కలుపు మందు... సమస్యలకు పరిష్కారం కానే కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉంటే పంటల్లో కలుపుమందు పిచికారీ వల్ల ఆ ఆహారపదార్థాలను తిన్న వారు భవిష్యత్‌లో క్యాన్సర్ బారిన పడే అవకాశం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ సెంటర్లు పేర్కొంటున్నాయి. కానీ వాటి సూచనలు పరిగణనలోకి తీసుకునే వారే కరువయ్యారు. ఇదిలాగే కొనసాగితే భవిష్యత్తులో ప్రతీ ఇల్లు క్యాన్సర్ పేషంట్లతో నిండిపోతుందని, పంటపొలాలు సైతం బీడుభూములుగా మారతాయని మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై గతనెల 30న ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురాం రెడ్డి సైతం కలుపుమందును నిషేధించాలంటూ పార్లమెంట్‌లో ప్రస్తావించారంటే అధ్యయనాలు ఎలాంటి సంకేతాలిచ్చాయో.. అర్థం చేసుకోవచ్చు.

విచ్చలవిడిగా కలుపుమందు వాడకం

పాశ్చాత్య దేశాల్లో నిషేధంలో ఉన్న కలుపు మందు.. ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాల్లో మార్పు చేసిన వివిధ పేర్లతో ప్రస్తుతం చెలామణిలోకి వచ్చింది. కలుపుమందు వినియోగంపై అవగాహన లేని రైతులు తగిన రీతిలో జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఆ ద్రావకం తుంపరలు పిచికారీ చేసే రైతుల శరీరంలో ప్రవేశించి అనేక రుగ్మతలకు కారణమవుతున్నాయి. పిచికారీ సమయంలో ఆ ద్రావకం కేవలం కలుపు మొక్కల మీదే కాక పక్కన ఉన్న పంటల మీద పడడం అసలు సమస్య అని రైతులు గుర్తించడం లేదు. అలాంటి పండ్లు, కూరగాయాలు, ఆకుకూరలపై ద్రావకం పడటం వల్ల దాని ప్రభావంతో వ్యవసాయ ఉత్పత్తులు కలుషితమవుతున్నా యి. తద్వారా క్యాన్సర్ కారకాలు, వాటిని వినియోగిస్తున్న మానవుల శరీరంలో ప్రవేశించి రక్షణ వ్యవస్థపై తమ ప్రభావం చూపుతున్నాయి. తద్వారా క్యాన్సర్ కణాలు ఎటువంటి నియంత్రణ లేకుండా వేగవంతంగా వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో మనిషిలోని అవయవాలు అతి వేగంగా దెబ్బతిని మరణించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

పరిష్కార మార్గాలు

- కలుపుమందు వాడకంతో వచ్చే అనర్థాలపై రైతులకు అవగాహన కల్పించాలి.
- కంపెనీలు నిర్దిష్ట మోతాదును అనుసరించి నిక్కచ్చిగా ఉత్పత్తి చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.
- వీలైతే ఎండ్రిన్ తరహాలో కలుపుమందును ఇతర రాష్ట్రాలకు మాదిరిగా నిషేధించాలి.
- ఇతర పనులకు వెళితే మంచి కూలీ దొరుకుతుందని భావిస్తున్న వ్యవసాయ కూలీలకు కూలి రేట్లు పెంచే ఆలోచనను ప్రభుత్వం, రైతులు చేయాలి.
- ప్రభుత్వం పంటలకు నిర్దిష్టమైన గిట్టుబాటు ధరలు కల్పించాలి.
- కలుపుమందును నివారించడానికి కొత్త యంత్రాలను, పరికరాలను కనిపెట్టి వాటిని త్వరితగతిన వినియోగంలోకి తేవాలి.
- కలుపుమందు అమ్మకాల్లో కఠినమైన ఆంక్షలను విధించాలి.
- ప్రభుత్వం సేంద్రీయ వ్యవసాయాన్ని అన్ని విధాలుగా ప్రోత్సహించాలి. వ్యవసాయ శాస్త్రవేత్తలు సైతం ప్రత్యామ్నాయాలపై పరిశోధనలు చేయాలి.

ఆత్మహత్యలకు వినియోగిస్తున్న బాధితులు

నేటి సమాజంలో మానవులు తమ జీవితాల్లో ఎదురవుతున్న చిన్న చిన్న సమస్యలను పరిష్కరించుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మన రాష్ట్రంలో సగటున రోజుకు 23మంది కలుపుమందు తాగి ఆత్మహత్యలకు పాల్పడి మృత్యువు ఒడిలోకి చేరుతున్నట్టు తాజా గణాంకాలు చెబుతున్నాయి. అలాంటి బాధితులు ఈ మధ్యకాలంలో ఎక్కువగా ఆత్మహత్య చేసుకోవడానికి కలుపుమందును తాగుతుండడం బాధాకరం. ఇలాంటి బాధితులు గతంలో పురుగుమందు తాగి ఆత్మహత్యలకు వాడేవారు. కానీ పురుగుమందు తాగిన అనేక మంది చికిత్సల ద్వారా బతికి బయటపడ్డారు. కానీ కలుపుమందు తాగిన వారు చికిత్స పొందుతూ మృతి చెందుతున్నారు. రోగికి అందించే వైద్యం కేవలం ఉపశమనం మాత్రమే.. కానీ రోగి ప్రాణాలను కాపాడలేని దీనస్థితికి చేరుకోవడమే కాక అత్యాధునిక వైద్య పరిజ్ఞానాన్ని కూడా సవాల్ చేస్తోంది.

పుట్టగొడుగుల్లా కలుపుమందు తయారీ కంపెనీలు

రైతులు అవగాహన లేక విరివిగా గ్లైఫోసేట్ (కలుపు మందులో అత్యధికంగా వినియోగించే రసాయనం)ను వినియోగిస్తున్నారని, తద్వారా ఎన్నో అనర్థాలు జరుగుతున్నాయని భావించిన ప్రభుత్వం 2022లో గ్లైఫోసేట్ పరిమితిపై నిషేధం విధించింది. కానీ దొడ్డిదారిలో గ్లైఫోసేట్ అమ్మకాలు జరుగుతూనే ఉన్నాయి. ఇక ఇతర కలుపుమందు తయారు చేసే కంపెనీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఆయా కంపెనీలు తయారీ సమయంలో (సంబంధిత కెమికల్) విచక్షణాశక్తి లేని స్పర్శ ద్వారా నివారించే కలుపు నాశనిని ఎంత మోతాదులో వాడారు!? అది పరిమితికి లోబడి ఉందా? లేదా? నిబంధనలను పాటించారా? లేదా? అన్న విషయాలను వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వశాఖ పరిధిలోని కేంద్ర పురుగుమందుల బోర్డు రిజిస్ట్రేషన్ కమిటీ పరిశీలించకుండానే కలుపుమందును తయారు చేయడానికి అనుమతులు ఇస్తుందనే విమర్శలు వెలువెత్తుతున్నాయి.

పిచికారీ సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి

● బాబూరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి

కలుపుమందు వాడకాన్ని వీలైనంత మేరకు తగ్గించుకోవాలి. కూలీలు దొరకని పరిస్థితుల్లో వాడాల్సి వచ్చినప్పుడు పిచికారీ సమయంలో మాస్కు, కళ్లద్దాలు ధరించాలి. గాలి వీచని సమయంలో పిచికారీ చేయాలి. పిచికారీకి ముందు తర్వాత స్ప్రేయర్ ట్యాంకును తప్పనిసరిగా శుభ్రం చేయాలి.

కూలీలు దొరకడం లేదు

● భూక్యా రాజేంద్రప్రసాద్, రైతు



కలుపు తీయడానికి కూలీలు దొరకడంలేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో కలుపుమందులపై ఆధారపడాల్సి వస్తుంది. సులువుగా కలుపును తీసే యంత్రాలు, పరికరాలు అందుబాటులోకి వస్తే బావుంటుంది.

ప్రమాదకర రసాయనాలతో కలుపు మందుల తయారీ

● తోటమళ్ల ప్రతాప్, సివిల్ అసిస్టెంట్ సర్జన్



కలుపు మందులు అత్యంత ప్రమాదకరమైన రసాయనాలతో తయారు చేస్తుంటారు. వాటిని తాగిన వ్యక్తిని వీలైనంత త్వరగా దగ్గరలోని ఆసుపత్రికి తరలించి.. ఆ వ్యక్తి తాగిన ద్రావకాన్ని శరీరం నుంచి బయటకు పంపించే ప్రక్రియను (కక్కించే పద్ధతిని) యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి. సదరు వ్యక్తి మానసిక స్థిరత్వాన్ని కోల్పోకుండా చూడాలి. వాటిని ఎప్పుడూ మనుషులకు అందుబాటులో (ఇంట్లో) లేకుండా చేస్తే కలుపుమందు మరణాలను వీలైనంత మేరకు తగ్గించవచ్చు.

భద్రాద్రి రామయ్యకు సువర్ణ తులసి అర్చన



భద్రాచలం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారికి శనివారం ఆర్జిత సేవగా సువర్ణ తులసి అర్చన నిర్వహించారు. కాగా స్వామి వారికి నిత్య కల్యాణం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ముందుగా శ్రీ సీతారామచంద్రస్వామి వారిని మేళతాళాలతో పల్లకిలో తీసుకువచ్చి చి త్రకూట మండపంలో కళ్యాణ వేదికపై ఆశీనులను చేశారు. ఈ సందర్భంగా కల్యాణ ప్రక్రియలో భాగంగా ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పూజలతో కల్యాణ ప్రక్రియ ముగిసింది.

బీఈడీ కౌన్సెలింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

» రాష్ట్ర మైనార్టీ సంఘం ప్రధాన కార్యదర్శి యాకూబ్ పాషా

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జరిగిన బీఈడీ 2025 ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణులైన ముస్లీం మైనార్టీ విద్యార్థులు ముస్లిం మైనార్టీ కాలేజీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ప్రత్యేక కౌన్సెలింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఎండి. యాకూబ్ పాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన ముస్లీం విద్యార్థులు ఈ ఏడాది జరిగిన ఎడ్‌సెట్ ర్యాంకు కార్డు, ఇంటర్, డిగ్రీ, పదో తరగతి మెమోలు, 9 నుంచి డిగ్రీ వరకు చదివిన స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, ఆదాయ ధృవీకరణపత్రాలు ఒరిజనల్‌తో పాటు తొమ్మిది సెట్ల జిరాక్స్ కాపీలను తీసుకుని బషీర్‌బాగ్‌లో గల ముస్లిం యూనివర్శిటీ, ఓల్డ్ స్టూడెంట్ అసోసియేషన్‌లో జరిగే కౌన్సిలింగ్‌కు హాజరుకావాలన్నారు. ఈ నెల 19న ఫిజికల్‌సైన్స్ మ్యాథమెటిక్స్, ఓరియంటల్ లాంగ్వేజ్ విద్యార్థులకు, 20న సోషల్‌స్టడీస్ విద్యార్థులకు, 21న బయోలాజికల్ సైన్స్ విద్యార్థులకు కౌన్సిలింగ్ జరుగుతుందన్నారు. వివరాలకు 9700375315, 8520860785ల్లో సంప్రదించాలన్నారు.

మెగా పాటల పోటీల్లో ఖమ్మం గాయని కీర్తనకు తృతీయ స్థానం



నిర్వాహకుల నుంచి బహుమతి అందుకుంటున్న గాయని కీర్తన

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మెగా స్టార్, మాజీ కేంద్రమంత్రి చిరంజీవి జన్మదినం సందర్భంగా రాష్ట్ర స్థాయిలో మెగా పాటల పోటీలలో ఖమ్మం జిల్లాకు చెందిన గాయని కీర్తన తృతీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు తెలంగాణ రాష్ట్ర చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ విల్సన్‌బాబు శనివారం మాట్లాడుతూ హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన సెమీ ఫైనల్స్, ఫైనల్స్‌లో ఖమ్మం గాయని కీర్తన మూడవ స్థానం సాధించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ నెల 8న ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో కీర్తన తొలి స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరైన సంగతి తెలిసిందే. అదేవిధంగా ఈ పోటీలలో ప్రథమ స్థానం నవ్య(సూర్యాపేట), ద్వితీయ స్థానం జీవన్(కోదాడ) గెలుచుకున్నారు. గెలుపొందిన గాయకులకు ఈ నెల 22న చిరంజీవి జన్మదిన సందర్భంగా బహుమతులు అందజేస్తామని, వివరాలు త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.

సరిపడా యూరియాను అందించాలి

కరకగూడెం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : రైతులకు అవసరం ఉన్నంత వరకు సరిపడా యూరియాను అందించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నిమ్మల వెంకన్న డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం మండల కన్వీనర్ కొమరం కాంతారావు అధ్యక్షతన అశ్వాపురంపాడులో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కొమరం కాంతారావు, చర్ప సత్యం, బిలపాటి శంకరయ్య, కనితి రాము, పద్దం బాబురావు, కొమరం మల్లక్క తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలి

ఖమ్మం ఖానాపురంహవేలి సీఐ



అవగాహన కలిగిస్తున్న సీఐ భానుప్రకాష్

ఖమ్మంక్రైం ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ఖానాపురంహవేలి సీఐ భానుప్రకాష్ తెలిపారు. నగర పరిధిలోని ధంసలాపురంలో స్థానికులకు సైబర్‌నేరాలపై అవగాహన కలిపించారు. ఆఫర్లు, గిఫ్టుల పేరుతో మీకు నగదు వచ్చాయని పలువురు సైబర్ నేరగాళ్లు ఫోన్‌చేసి వలవేస్తారని, వారి వలలో పడకుండా ఉండాలన్నారు. తెలియని వారినుంచి వచ్చి లింక్ మెసేజ్‌లు ఓపెన్ చేయవద్దన్నారు.

ఉపాధి హామీ కార్యాలయంలో మంటలు

» ఏన్కూరులో రికార్డులు దగ్ధం

» ఘటనపై పలు అనుమానాలు



ఈజీఎస్ కార్యాలయంలో చెలరేగుతున్న మంటలు

ఏన్కూరు, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): ఏన్కూరులోని ఉపాధి హామీ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం మంటలు చెలరేగాయి. దీంతో రికార్డులు దగ్ధమయ్యాయి. ఉపాధి హామీ పథకం 2006 నుంచి 2024 సంవత్సరం వరకు పనులకు సంబంధించిన రికార్డులు, ఇతర ఫైల్స్ అగ్నిప్రమాదంలో దగ్ధమయ్యాయి. వీటితోపాటు బీరువాలు, ఇతర సామగ్రి మంటల్లో కాలిపోయాయి. ఏపీవో సూరయ్య సమాచారం తెలిసిన వెంటనే తహసీల్దార్‌కు, ఎస్ఐ,ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. స్థానికులు, రేపల్లేవాడకు చెందిన యువత వెంటనే స్పందించి మంటలు ఆర్పేప్రయత్నం చేశారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఏన్కూరులోని శ్రీభక్తి భవనంలో ఐకేపీ కార్యాలయం, ఉపాధి హామీ కార్యాలయం ఉన్నాయి. ఈ కార్యాలయాలు ఎదురెదురుగా ఉన్నాయి. మంటలు ఐకేపీ కార్యాలయానికి అంటుకోకుండా ఐకేపీ సిబ్బంది జాగ్రత్తపడ్డారు. ఈజీఎస్ భవనం పూర్తిగా కాలిపోవడంతో భవనం పనికిరాకుండా పోయింది. ఈ ప్రమాదంపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ మహ్మద్ ఉఫాతుల్ రఫీ, ఎంపీడీవో జీవీఎస్ నారాయణ, ఆర్ఐ శ్రీనివాస్ పరిశీలించారు.

బైక్ కొనివ్వలేదని తండ్రిపై దాడి

» నిద్రిస్తుండగా గొడ్డలితో నరికిన కుమారుడు

» ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తండ్రి

» ఖమ్మం జిల్లా మంగళగూడెంలో ఘటన

ఖమ్మంరూరల్, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): బైక్ కొనివ్వలేదన్న ఓ కుమారుడు ఏకంగా కన్నతండ్రిపైనే గొడ్డలితో దాడిచేసిన సంఘటన ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం మంగళగూడెం గ్రామంలో జరిగింది. ఈ నెల 13న జరిగిన ఈఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం మంగళగూడెం గ్రామానికి చెందిన బండారు నాగయ్య, నాగలక్ష్మీ దంపతులకు ఓ కూతురు, కుమారుడు ఉన్నారు. కూతురికి వివాహం కాగా.. 20 ఏళ్ల వయసున్న కుమారుడు బండారు సతీష్ 8వ తరగతి వరకు చదువుకుని ఆపేసి.. ఏపనీ చేయకుండా జులాయిగా తిరుగుతున్నాడు. ఈ క్రమంలో ఇటీవల తనకు సెల్‌ఫోన్ కావాలని గొడవ చేయగా.. ఇబ్బందిపడైనా ఆ తల్లిదండ్రులు సెల్‌ఫోన్ కొనిచ్చారు. ఆ తర్వాత గత రెండు నెలలుగా తనకు బైక్ కొనివ్వాలని తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టడం ప్రారంభించాడు. అయితే తాము ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నామని, బైక్ కొనలేమని, ఏదైనా పని చేసుకుని బండి కొనుక్కోవాలని తండ్రి నాగయ్య కొడుకుకి సూచించాడు. దీంతో కోపోద్రిక్తుడైన సతీష్ బైక్ కొనివ్వకుంటే ఇద్దరినీ చంపుతానని తల్లిదండ్రులను బెదిరిస్తున్నాడు. ఇదే క్రమంలో ఈనెల 13వ తేదీ రాత్రి రేపటి వరకు బండి కొనాలని తల్లిదండ్రులను కోరగా.. తాము కొనలేమని ఖరాఖండిగా చెప్పడంతో.. 'ఈ రోజే మిమ్మల్ని ఇద్దరిని చంపుతాను.. చూస్తూ ఉండండి' అంటూ బెదిరించాడు. ఆ తర్వాత తల్లిదండ్రులతో పాటే నిద్రించిన సతీష్ 13వతేదీ అర్ధరాత్రి సమయంలో నిద్ర లేచి ఇంట్లో ఉన్న గొడ్డలితో గాఢ నిద్రలో ఉన్న తండ్రి నాగయ్యతలపై నరికాడు. దీంతో నాగయ్య తలకు తీవ్రగాయాలవగా.. నాగలక్ష్మి భర్త వద్దకు వెళ్లే ప్రయత్నం చేయగా.. సతీష్ ఆమెపై కూడా దాడికి ప్రయత్నించాడు. దీంతో ఆమె ఇంట్లో నుంచి బయటకు వచ్చి పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు వచ్చే సరికి సతీష్ గొడ్డలి అక్కడే పడేసి పరారయ్యాడు. నాగలక్ష్మి వెంటనే స్థానికుల సహాయంతో తన భర్తను ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడినుంచి ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించింది. ప్రస్తుతం తీవ్ర గాయమైన నాగయ్య చికిత్స పొందుతున్నాడు. ఈ విషయంపై నాగయ్య భార్య నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సతీష్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ప్రేమమత్తులో.. దారితప్పుతున్న యువత

పోలీసులను ఆశ్రయిస్తున్న జంటలు

అవగాహన లేని వయసులో అవస్థల పాలు

ఖమ్మంక్రైం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అవగాహన లేని వయసులో ప్రేమలో పడుతున్న యువత దారితప్పుతోంది. ఒక్కసారిగా వారిమధ్య ఏర్పడుతున్న మనస్పర్థలతో కొందరు జీవితాలను నాశనం చేసుకుంటుంటుంటే.. మరికొందరు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. అంతేకాదు ఒకరిని ప్రేమిస్తూనే మరొకరితో ప్రేమలో పడి.. ఒకరు కాదు, ఇద్దరు కావాలి అంటూ తప్పుదోవపడుతున్నారు. దీంతో ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఇలాంటి ఘటనలు జిల్లాలో జరుగుతున్నా కొంతమంది గుట్టుచప్పుడు కాకుండా వ్యవహరిస్తున్నారు. మరికొంత మంది పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పోలీసులు కూడా ఏం చేయాలో అర్థంకాక.. ఇరువురిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించడం తప్ప మరో దారిలేకుండా పోతోందని చెబుతున్నారు. మరికొంత మంది అయితే ప్రేమించిన అబ్బాయిని కాదని మరొకరిని చూసుకుంటూ జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. ఇలాంటి సంఘటన ఒకటి ఖమ్మం నగర పరిధిలో జరిగి హైదరాబాదు వనస్థలిపురం పోలీసుస్టేషన్ వరకు చేరింది.

ఇద్దరు అబ్బాయిలతో ప్రేమ వ్యవహారం అమ్మాయి ఆత్మహత్యాయత్నం

ఖమ్మం నగర సమీప మండలానికి చెందిన ఓ యువతి, నగర పరిధిలోని ఓ ప్రాంతానికి చెందిన యువకుడు కొంతకాలంగా ప్రేమించుకున్నారు. ఈక్రమంలో ఇద్దరు పెళ్లిచేసుకుందామని నిర్ణయించుకున్నారు. అదే సమయంలో ప్రేమికుడి స్నేహితుడికి, సదరు యువతికి పరిచయం కావడం, అది కూడా చనువుగా మారింది. ఈ విషయం మొదటి ప్రేమికుడికి తెలియడంతో సదరు యువతిని నిలదీశాడు. చేసేదిలేక సదరు యువతి హైదరాబాదు వనస్థలిపురలోని తన సోదరి ఇంటికివెళ్లి ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఈనెల7న ఉరేసుకుని ఆత్మహత్యయత్నం చేసింది. ఈ విషయం ప్రేమికుడికి తెలపడంతో సదరు యువకుడు ఆమె సోదరి ఇంటివద్దకు వచ్చి యువతిని అక్కడి ఓ ఆసుపత్రికి తరలించగా.. అనంతరం కుటుంబసభ్యులు ఆమెను ఖమ్మంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. ఈఘటనపై సదరు యువతి కుటుంబసభ్యులు హైదరాబాదు వనస్థలిపురంలో ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

నేడు సీపీఐ నేత అయోధ్య సంతాప సభ

హాజరు కానున్న రాష్ట్ర నేతలు

మణుగూరుటౌన్, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్యచారి సంతాప సభను మణుగూరులోని కిన్నెర కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం నిర్వహిస్తున్నట్లు ఆపార్టీ నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి శనివారం తెలిపారు. ఇటీవల సూర్యపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన మృతి చెందిన విషయం తెలిసిందే.. ఈసంతాప సభలో పార్టీ జిల్లా, రాష్ట్రనాయకులు, కార్యవర్గ సభ్యులు, పాల్గొనబోతున్నట్లు తెలిపారు. సీపీఐ శ్రేణులు ఈ కార్యక్రమంలో హాజరు కావాలని ఆయన కోరారు.

కుటుంబ సభ్యులను పరామర్శించిన జిల్లా కార్యదర్శి సాబిర్ పాషా

శనివారం మణుగూరులో పర్యటించిన జిల్లా కార్యదర్శి షాబీర్ పాషా మండలంలోని రామానుజవరం గ్రామం చేరుకుని అయోధ్య స్వగృహంలో అయోధ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంతాప సభకు సంబంధించిన కార్యక్రమాలపై పార్టీ నాయకులతో చర్చించారు. అనంతరం సమితి సింగారంలో సీనియర్ కార్యకర్త వేర్పుల ఇన్నమ మృతిచెందిన విషయం తెలుసుకుని నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో సీపీఐ మండల జిల్లా, మండల నాయకులు సరెడ్డి పుల్లారెడ్డి, జంగం మోహన్‌రావు, సర్వర్, దుర్గాల సుధాకర్, మున్నాలక్ష్మీకుమారి, మువ్వా వెంకటేశ్వర్లు, జక్కుల రాజబాబు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల చోరీ: ఇద్దరు యువకుల అరెస్ట్

లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలు చోరీ చేసిన ఇద్దరు యువకులను పోలీసులు అదపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన శనివారం లక్ష్మీదేవిపల్లిలో చోటుచేసుకుంది. లక్ష్మీదేవిపల్లి రైతువేదిక సమీపంలో ఎస్సై రమణారెడ్డి మధ్యాహ్న సమయంలో వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో బొమ్మనపల్లి వైపు నుంచి ఇద్దరు అనుమానిత యువకులు రెండు ద్విచక్ర వాహనాలపై వేరు వేరుగా వస్తున్నారు. పోలీసులను చూసి వారి పారిపోతుండగా సిబ్బంది వెంబడించి అదుపులోకి తీసుకుని విచారించారు. న్యూగొల్లగూడేనికి చెందిన మోటార్ సైకిల్ మోకానిక్ భీమవరపు యువరాజు, లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రాపురానికి చెందిన కంచర్ల అరవిందరెడ్డి అనే యువకులు సూర్యపేట జిల్లా కోదాడలో పల్సర్, టీవీఎస్ ఎక్స్‌ఎల్ ద్విచక్ర వాహనాలను దొంగలించినట్లు ఒప్పుకున్నారు. వాటిని పాల్వంచలో అమ్మేందుకు తీసుకెళుతున్నట్లు తెలిపారు. దీంతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమణారెడ్డి తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

ఐదేళ్లక్రితం భర్త మృతి

అనాథలైన నలుగురు పిల్లలు

పినపాక, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లక్రితం తండ్రి చనిపోయాడు.. ఇప్పుడు తల్లి ఆత్మహత్య చేసుకుంది. దీంతో నలుగురు పిల్లలు అనాథలుగా మిగిలారు. ఈ విషద ఘటన పినపాక మండలంలోని మల్లారం గ్రామంలో శనివారం జరిగింది. మల్లారం గ్రామానికి చెందిన కుంజా సమ్మక్క (45) ఈనెల 14న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. బంధువులు ఆమెను మణుగూరులోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. బంధువుల ఫిర్యాదుతో, ఏడూళ్లబయ్యారం ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేశారు. ఆత్మహత్యకు కుటుంబ కలహాలే కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి నలుగురు సంతానం కాగా, ముగ్గురు మగపిల్లలు, ఓ ఆడపిల్ల ఉంది. ఏడూళ్లబయ్యారం పోలీస్ స్టేషన్‌లో గతంలో పని చేసిన ఎస్ఐ టీవీఆర్ సూరి మృతురాలి కుమార్తె చదువు బాధ్యతలు చూస్తున్నారు. ఎస్ఐ రాజ్‌కుమార్ రూ.10వేలుసాయం, దుస్తులు అందించారు.



24న వురిమళ్ల ఫౌండేషన్ వార్షికోత్సవం

ఖమ్మంచర్చికాంపౌండ్, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): ఈనెల 24న ఖమ్మంలోని బీవీకే హాల్‌లో వురిమళ్ల ఫౌండేషన్ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్టు వ్యవస్థాపకుడు భోగోజు ఉపేందర్‌రావు, వురిమళ్ల సునంద(భోగోజు) తెలిపారు. శనివారం నగరంలోనిప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సునంద ఈ వివరాలు వెల్లడించారు. సమాజంలో తనకు గుర్తింపు తెచ్చిన అక్షరరుణం తీర్చుకొనేందుకు 2019లో వురిమళ్ల ఫౌండేషన్‌ను ప్రారంభించామన్నారు. పలువురు రచయితలకు బహుమతులు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రముఖ కవులు హాజరు కానున్నట్టు తెలిపారు. ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని కవులు, సాహితీవేత్తలు, రచయితలు హాజరు కావాలని ఆహ్వానం పలికారు.



శ్రీకృష్ణుడికిపూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణలు

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్మార్ట్‌కిడ్జ్, రామకృష్ణ విద్యాలయం, టైనీటాట్స్ పాఠశాలల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో ఆకట్టుకున్నారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమంలో చిన్నారులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యాలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో చిన్ని కృష్ణుని పాదముద్రలను వేసి రంగురంగులతో అందంగా దిద్దారు.

తిరుమలాయపాలెం: మండలంలోని వివిధ గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు.పిండిప్రోలులో ప్రబోధ సేవా కమిటీ హిందు జ్ఞానవేదిక ఆధ్వర్యంలో వేడుకలునిర్వహించారు. స్వామివారికి పూజలు చేశారు. మండలంలోని కాకరవాయి, బీరోలు, పాతర్లపాడు తదితరగ్రామాల్లో వేడుకలు నిర్వహంచారు.



రామకృష్ణ విద్యాలయంలో..



స్మార్ట్‌కిడ్జ్‌లో



టైనీటాట్స్‌లో..



ముంపు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

- ఎగువ నుంచి వచ్చే వరదను ఎప్పటికప్పుడు అంచనా వేయాలి
- ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలి
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మంరూరల్,ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరదతో మున్నేరు ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో అన్నిశాఖల అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. ఎప్పటికప్పుడు లోతట్టు ప్రాంతాల ప్రజలందరూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఏదులాపురం మునిసిపాలిటి పరిధిలోని పెద్దతండాలోని కేబీఆర్‌నగర్ ప్రాంతంలో మున్నేరువరద ఉధృతిని శనివారం కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. సుమారు 21, 22 అడుగులు మేర వరద పెరిగితే రాజీవ్‌గృహకల్ప, వికలాంగుల కాలనీ, కేబీఆర్‌నగర్, అభయటౌన్‌షిప్ కాలనీలకు ఇబ్బంది కలుగుతుందని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. 25అడుగులకు వరదవస్తే 12వార్డుల ప్రజలకు ఇబ్బంది ఏర్పడుతుందన్నారు. ఒక్కో వార్డుకు ఒకట్రాక్టర్ 5సిబ్బందిని నియమించి వారి ద్వారా ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. నాయుడుపేటలోని రాంలీల ఫంక్షన్‌హాల్, టీసీవీరెడ్డి ఫంక్షన్ హల్, వెంకటేశ్వర కల్యాణ మండపం, స్ప్రింగ్‌లీఫ్ పాఠశాలలోపునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం తీర్థాల వద్ద ఆకేరు 18 అడుగులతో ఉధృతంగా ప్రవహిస్తుంది. అదేవిదంగా నాయుడుపేట వద్ద మున్నేరు 15 అడుగులు ప్రవహిస్తుంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.





పెద్దతండాలో మున్నేరు వరదను పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్, పాలేరు జలాశయాన్ని పరిశీలిస్తున్న ఏడీసీపీ ప్రసాదరావు

నీటిప్రవాహాల వద్ద సెల్ఫీలు నిషేధం
అదనపు డీసీపీ ప్రసాదరావు

కూసుమంచి: జలాశయాల వద్ద, నీటిప్రవాహాలవద్ద సెల్ఫీలు నిషేధమని అదనపు డీసీపీ (లాఅండ్‌ఆర్డర్) ప్రసాదరావు సూచించారు. శనివారం కూసుమంచి మండలం పాలేరు జలాశయాన్ని సందర్శించారు. ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో అడిగి తెలుసుకున్నారు.ప్రజలను, పోలీస్ అధికారులను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీట మునిగిన రోడ్లు, వాగులు దాటే ప్రయత్నం చేయవద్దని చేపల వేటకు వెళ్లొద్దని పశువుల కాపర్లు చెరువులు వాగులు దాటొద్దని సూచించారు. యువకులు సెల్ఫీలకోసం నీటిప్రవాహాలకు వెళ్లే సాహసం చేయొద్దని సూచించారు. ఆయన వెంట కూసుమంచి సీఐ సంజీవ్, ఎస్ఐ నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు. నర్సింహలగూడెం పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. అయినప్పటికీ చేపలు పెద్దసంఖ్యలో దొరుకుతుండటంతో జనం చేపల షికారు చేస్తుండగా, సందడి నెలకొంది. నర్సింహలగూడెం-కొత్తూరు, గైగొళ్లపల్లి-లాల్‌సింగ్‌తండ, చేగొమ్మ-తాళ్లచెరువు గ్రామాల మధ్య వాగులు పొంగిప్రవహిస్తున్నాయి.

గ్రామాల మధ్య నిలిచిన రాకపోకలు

తిరుమలాయపాలెం: మండలంలోని బీరోలు పెద్దచెరువు అలుగుపడడంతో బీరోలు, బచ్చోడు, రాజారం, కాకరవాయి గ్రామాల మధ్య రాకపోకలునిలిచాయి. బచ్చోడు,హస్నాబాద్ మధ్య ఉన్న బచ్చోడు చెరువు అలుగుపోస్తుంది.దీంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలు నిలిచాయి. మేడిదపల్లి-సుబ్లేడు మధ్య రాకపోకలు కూడా నిలిచాయి. భవానమ్మగుడివద్ద చప్టా అలుగుపోస్తుంది. హస్నాబాద్ చెరువుకట్ట ప్రమాదంగా ఉండడంతో రాకపోకలు నిలిపివేశారు.

రెండు జిల్లా రాకపోకలకు అంతరాయం

కామేపల్లి: మండల పరిధిలోని బండిపాడు స్టేజీ వద్ద బుగ్గవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. లోలెవెల్‌బ్రిడ్జి పైనుంచి వరద నీరు వెళుతుంది. ఖమ్మం మహబూబాబాద్ సరిహద్దు జిల్లాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కారేపల్లి సీఐ తిరుపతిరెడ్డి, డీపీవో ఆశలత, డీఎల్పీఓ రాంబాబు, ఎంపీఓ ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు.

రాజేశ్వపురం-మాదాపురం మధ్య నిలిచిపోయిన రాకపోకలు

నేలకొండపల్లి: రాజేశ్వరపురం చెరువు పూర్తి స్థాయిలో నిండింది. దీంతో చెరువు పక్కనే ఉన్న వరి పొలాలు పూర్తిగా నీట మునిగిపోయాయి. రాజేశ్వరపురం నుంచి ముదిగొండ మండలం మాదాపురం గ్రామానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. రోడ్డు తెగిపోవటంతో మనుషులు నడవటానికి సైతం వీల్లేని పరిస్థితి నెలకొంది. ఆరెగూడెం యూటీ నిర్మాణ లోపాలతో వరద నీరు పూర్తిగా రోడ్డుపై నుంచి పోతుండటంతో రోడ్డు తెగి పోయింది.







బుగ్గవాగు ఉధృతిని పరిశీలిస్తున్న డీపీవో ఆశలత, బీరోలు-బంధంపల్లి మధ్య వాగుదాటుతున్న ప్రజలు, కూసుమంచి మండలం నర్సింహలగూడెం వద్ద చేపల షికారు

టీడీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాసరావు మృతి

ఖమ్మం మామిళ్లగూడెం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ 5వ డివిజన్ సీనియర్ నాయకుడు కోయ శ్రీనివాసరావు (64) శనివారం తెల్లవారు జామున మృతి చెందాడు. ఆయన తీవ్ర గుండెనొప్పితో మృత్యువాతపడ్డారు. ఆయనకు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శ్రీనివాసరావు మృతి వార్త తెలియగానే టీడీపీ నాయకులు కేతినేని హరీష్ వెళ్లి శ్రీనివాసరావు భౌతిక ఖాయానికి పార్టీ జెండాను కప్పి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన పార్టీకి చేసిన సేవలను శ్లాఘించారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. నివాళులు అర్పించిన వారిలో చంద్రం, పంతంగి వెంకటేశ్వర రావు, కోలేటి రాధా, చింతనిప్పు నాగేశ్వరరావు, కన్నేటి పృథ్వి, నారాయణరావు తదితరులున్నారు.

వాజ్‌పేయికు ఘన నివాళి

ఖమ్మంబైపాస్‌రోడ్,ఆగస్టు16(ఆంధ్రజ్యోతి):బీజేపీ జిల్లా కార్యాలయంలో మాజీ ప్రధాని అటల్‌బీహారి వాజ్‌పేయి ఆరోవర్ధంతి నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. రాజకీయాలు అధికార సాధనం కాదని.. సేవా సాధనమే కావాలని వాజపేయి చెప్పిన మాటలు ప్రతీఒక్కరికి మార్గదర్శకంగా నిలిచాయన్నారు. ఈకార్యక్రమంలో గంటేల విద్యాసాగర్, అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, వీరెల్లి రాజేష్, నాగేందర్, నరేష్, రామకృష్ణ, మాధవ్,కుమిలి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కోటేశ్వరరావు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరెడ్డి

కూసుమంచి, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. మండల ఇన్‌చార్జ్ భీరెండి శ్రీనివాస రెడ్డి 90మందికి రూ.30లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. పేదప్రజలకు మెరుగైన ఆరోగ్యం లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని శ్రీనివాసరెడ్డి చెప్పారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ముంపు బాధితులకు అన్నదానం

వైరా, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ నాల్గోవార్డు పరిధిలోని రాజీవ్ కాలనీలో కొన్ని ఇళ్లు ముంపునకు గురయ్యాయి. దీంతో ముంపు బాధితుల కోసం స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. భోజనాలు, ఇతర సౌకర్యాలను కల్పించారు. మునిసిపల్ కమిషనర్ చింతా వేణు, ఎస్ఐ రామారావు, ట్రెయినీ ఎస్ఐ వెంపటి పవన్ బాధితులకు భోజనాలు వడ్డించారు.

వికలాంగులకు రూ.6వేలు పింఛన్ ఇవ్వాలి : ఎమ్మెస్పీ



నేలకొండపల్లి, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వికలాంగులకు పెన్షన్ రూ.6వేలకు పెంచాలని ఎమ్మెస్పీ జిల్లాఅధ్యక్షుడు అంజయ్య డిమాండ్ చేశారు. శనివారం నేలకొండపల్లిలో జరిగిన ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, వీహెచ్‌పీఎస్ ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ వికలాంగులకు రూ.6వేలు ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఈనెల 30న నేలకొండపల్లి శ్రీకర గార్డెన్స్‌లో జరుగనున్న పాలేరు నియోజకవర్గ స్థాయి సమావేశానికి మంద కృష్ణ మాదిగ హాజరు కానున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అంజయ్య పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు మాదాసు వెంకన్న, పొట్టపింజర బాలస్వామి, తోళ్ళ వెంకన్న, తోళ్ల సురేష్, బండి కరుణాకర్, రాజు పాల్గొన్నారు.

పీఎస్ఆర్ రోడ్డు విస్తరణకు మోక్షం

- వ్యవసాయ మార్కెట్‌కు వెళ్లేందుకు విశాలమైన రహదారి
- గాంధీచౌక్, త్రీటౌన్ రిటైల్ వ్యాపారుల రవాణాకు సుగమం

ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని పురాతన రహదారి పొట్టి శ్రీరాములు రోడ్డుకు మోక్షం కలిగింది. ఇరుకుగా ఉన్న ఈదారిని సౌకర్యవంతంగా ఉండేందుకు విస్తరిస్తున్నారు. ట్రంక్‌రోడ్డు నుంచి త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌సర్కిల్ వరకు సుమారు కిలోమీటరు వరకు ఉన్న రహదారిని విస్తరించనున్నారు.ఈమేరకు పనులు ప్రారంభించారు. నగరంలో అతిపురాతన రహదారిలో ముందుండేది పొట్టి శ్రీరాములు రోడ్డు.. ఇప్పుడున్న ఖమ్మంనగరం, పూర్వం ఖమ్మం మెట్టుగా ఖ్యాతి పొందింది. ఆ సమయంలో పొట్టిశ్రీరాములు రోడ్డు, గాంధీచౌక్ ప్రాంతాలు ప్రధాన వ్యాపార కేంద్రాలుగా ఉండేవి. తర్వాత కాలంలో వైరా రోడ్డులో మరో బస్టాండ్ రావటంతో పాటుగా వైరారోడ్డు, వీడియోస్ కాలనీ, టీఎన్జీవోస్ కాలనీ, ఇల్లెందు రోడ్డు ఇలా ఖమ్మం నగరం విస్తరణ జరగటంతో పొట్టిశ్రీరాములు రోడ్డులోని వ్యాపారాలపై ప్రభావం పడింది. అయితే మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఖమ్మం త్రీటౌన్ ప్రాంతం అభివృద్ధిపై దృష్టి పెట్టారు. ఇదే ప్రాంతంలోని వ్యవసాయ మార్కెట్‌ను ఆధునికీకరణ చేపట్టారు. ఈ క్రమంలో మార్కెట్‌కు వాహనాలు రాకపోకలతో పాటుగా గాంధీచౌక్, త్రీటౌన్ ప్రాంతాల్లోని రిటైల్ వ్యాపారులకు సౌకర్యవంతమైన రవాణా సౌకర్యం మెరుగు పర్చేందుకు రోడ్డు వెడల్పు పనులకు ఆదేశించారు. దీంతో ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు పీఎస్ఆర్ రోడ్డు విస్తరణ పనులు ముమ్మరం చేశారు. త్వరలో పనులు పూర్తి చేసి, రోడ్డును విస్తరించనున్నారు.దీంతో ఈప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రహదారుల విస్తరణతోనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు.



విస్తరణ జరిగిన రహదారి



విస్తరణ చేస్తున్న యంత్రాలు

20.3అడుగులకు వైరా రిజర్వాయర్

వైరా, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వైరా రిజర్వాయర్ 20.3అడుగుల నీటిమట్టాన్ని దాటింది దాంతో రిజర్వాయర్ ఐదు అలుగుల నుంచి భారీ వరద నీటితో వైరా నది పరవళ్లు తొక్కుతోంది. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటిమట్టం 18.3అడుగులు కాగా పరివాహక ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలతో భారీ వరదనీరు వచ్చిచేరింది. దాంతో పూర్తిస్థాయి నీటిమట్టానికంటే రెండు అడుగుల మేర అదనపు నీరు రావడంతో వైరా నాల్గోవార్డులోని రాజీవ్‌కాలనీలోని లోతట్టు ఇళ్లు వరద నీటిలో చిక్కుకున్నాయి. వైరాలో 63.20మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వైరా నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కొన్ని గ్రామాల మధ్య రాకపోకలు నిల్చిపోయాయి.

పార్టీ సిద్ధాంతాల కోసం పనిచేసిన కోటయ్య

సంతాపసభలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బుగ్గవీటి సరళ



మాట్లాడుతున్న రాష్ట్ర కమిటీ సభ్యురాలు బుగ్గవీటి సరళ

ఖమ్మంసంక్షేమ విభాగం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి):సీపీఎం సిద్ధాంతాల కోసం దొంగల కోటయ్య జీవితకాలం పని చేశారని, కుటుంబ సభ్యులను ఆదే ఆదర్శాలతో పెంచారని నేటి తరానికి కోటయ్య జీవితం ఆదర్శమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బుగ్గవీటి సరళ పేర్కొన్నారు. సీపీఎం ఖానాపురం హవేలి కమిటీ కార్యదర్శి దొంగల తిరుపతిరావు తండ్రి కోటయ్య ఇటీవల కన్నుమూశారు. శనివారం ఖానాపురం హవేలి కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కోటయ్య సంతాప సభలో బుగ్గవీటి సరళ మాట్లాడారు. డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ మాట్లాడుతూ కోటయ్య పార్టీ అభివృద్ధికి ఎంతో కష్టపడ్డారని తెలిపారు. పార్టీ కార్యాలయం నిర్మాణంలో తనవంతు కృషి చేశారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో దొంగల తిరుపతిరావు, పిన్నింటి రమ్య, గాలి వెంకటాద్రి, పోతురాజు వెంకటి, కత్తుల అమరావతి, జట్ల ఆనందరావు, గాలి అంజయ్య, తోట నాగరాజు, ప్రసాద్, తిప్పర్తి నర్సింహారావు, కుర్రి వెంకటస్వామి, వేదగిరి మురహరి, మాచర్ల గోపాల్, కోరిని వెంకటి, కుర్రి రవి, జాఫర్, చారి, జాన్‌బీ, ప్రీతం, పుష్ప, పున్నారావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు విద్యార్థుల ఎంపిక

కల్లూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి వాలీబాల్ క్రీడలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో ఆగస్టు 15న వాలీబాల్ క్రీడ పోటీల ఎంపికలు జరగగా, వారిలో కల్లూరుకు చెందిన పి.అనూషా, బి.నాగేశ్వరి, ఎస్.ఉమాలత బాలికల విభాగం, బాలుర విభాగంలో కోటారామ్, ముత్యాలు, ఎంపికైనారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి పి.నివేదిత, వ్యాయామ ఉపాధ్యాయులు భీమా, వీరరాఘవయ్యలు వారిని అభినందించారు. ఈ నెల 18, 19 వ తేదిల్లో హైదరాబాద్ ఇబ్రహీంపట్నం నందు జాతీయ స్థాయి ఎంపిక పోటీల్లో వారు పాల్గొనున్నారు.



ఆంధ్రజ్యోతి

● మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
● వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు , జూలూరుపాడు
● సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి

ZONE

ఆదివారం 17 ఆగస్టు 2025

వైరా-మధిర
సత్తుపల్లి

WYRA, MADHIRA, SATHUPALLY

ముంపు బాధితులకు అన్నదానం

వైరా, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ నాల్గోవార్డు పరిధిలోని రాజీవ్‌కాలనీకి చెందిన ముంపు బాధితుల కోసం స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఈ బాధితులకు భోజనాలు, ఇతర సౌకర్యాలను కల్పించారు. మునిసిపల్ కమిషనర్ చింతా వేణు, ఎస్ఐ రామారావు, ట్రెయినీ ఎస్ఐ వెంపటి పవన్ బాధితులకు భోజనాలు వడ్డించారు.



అన్నదానం చేస్తున్న కమిషనర్

రాష్ట్రస్థాయి క్రీడలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడలకు ఎంపికైన కల్లూరు క్రీడాకారులు

కల్లూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి వాలీబాల్ క్రీడలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో ఆగస్టు 15న వాలీబాల్ క్రీడ పోటీల ఎంపికలు జరగగా, వారిలో కల్లూరుకు చెందిన పి.అనూషా, బి.నాగేశ్వరి, ఎస్.ఉమాలత బాలికల విభాగం, బాలుర విభాగంలో కోటా రామ్, ముత్యాలు, ఎంపికైనారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి పి.నివేదిత, వ్యాయామ ఉపాధ్యాయులు భీమా, వీరరాఘవయ్యలు వారిని అభినందించారు. ఈ నెల 18, 19 వ తేదిల్లో హైదరాబాద్ ఇబ్రహీంపట్నం నందు జాతీయ స్థాయి ఎంపిక పోటీల్లో వారు పాల్గొనున్నారు.

ఘనంగా సర్దార్ గౌతు లచ్చన్న జయంతి

వేంసూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని వేంసూరులోని కల్లు గీత కార్మిక సంఘం భవనం వద్ద శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గౌడసంఘం సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

దశాబ్దాల చరిత్ర గల రావివృక్షం నేలమట్టం

» సకాలంలో స్పందించి ట్రాఫిక్‌ను క్లియర్ చేసిన ఎస్ఐ

బోనకల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకీపురం గ్రామంలోని ముజఫర్ నగర్ సమీపంలో వైరా-జగ్గయ్యపేట ప్రధాన రహదారి పక్కనే ఉన్న దశాబ్దాల చరిత్ర గల రావివృక్షం శనివారం నేలమట్టమైంది. రెండు వైపుల ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ పొదిలి వెంకన్న, పోలీస్ సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకుని చెట్టును తొలగించే పనులను చేయించారు. సకాలంలో స్పందించి ట్రాఫిక్ క్లియర్ చేసినందుకు గానూ ప్రయాణీకులు ఎస్ఐకు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో శ్రీ కృష్ణ జన్మాష్టమి

శ్రీ కృష్ణజన్మాష్టమి సందర్భంగా పలు ప్రాంతాల్లో వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. నల్లనయ్య కోసం ఇళ్ల ముందు ముగ్గులు వేసి తమ పిల్లల్ని చిన్ని కృష్ణుడిగా, గోపికల వలే ముస్తాబు చేసుకుని మురిసిపోయారు. ఎర్రుపాలెంలో తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోకులాష్టమి సందర్భంగా ఆయే కన్నయ్య.. నంద లాలా.. అని భజన సంకీర్తనలతో.. భక్తులు ఆయన్ను ప్రసన్నం చేసుకుంటూ ఉత్సాహంగా పాటలు పాడారు. ఈ సందర్భంగా పలు ప్రదేశాల్లో నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కృష్ణ, గోపికల వేషధారణలో చిన్నారులు



ఎర్రుపాలెం గోకులంలో గోపూజ నిర్వహిస్తున్న దృశ్యం



సత్తుపల్లిలో శ్రీ కృష్ణమందిరం వద్ద ఉట్టికొడుతున్న భక్తులు



చింతకానిలో..



బోనకల్‌లో ఉట్టి కొడుతున్న ఎస్ఐ వెంకన్న



సత్తుపల్లి కృష్ణమందిరం వద్ద ఉట్టికొడుతున్న ఎమ్మెల్యే రాగమయి



వైరాలో ఉట్టికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



ట్రాన్స్‌కో ఎస్ఈ ఇతర అధికారులతో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

విద్యుత్ సరఫరాలో అప్రమత్తత అవసరం

వైరా, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వైరా నియోజకవర్గంలో విద్యుత్ సరఫరా విషయంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ సూచించారు. ట్రాన్స్‌కో జిల్లా ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి, డీఈలు బండి శ్రీనివాసరావు, నంబూరి రామారావు ఇతర అధికారులతో శనివారం నియోజకవర్గంలో విద్యుత్ సరఫరా తదితర అంశాలపై సమీక్షించారు. నియోజకవర్గంలో కొత్తగా నిర్మించే విద్యుత్ సబ్‌స్టేషన్లు, విద్యుత్ లైన్ల ప్రతిపాదనల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఇళ్లపైనుంచి వెళ్తున్న లైన్లను తొలగించడానికి కావల్సిన అంచనా ప్రతిపాదనలు కూడా సమీక్షించారు. గిరిజనుల వ్యవసాయ బావులకు విద్యుత్ లైన్లు వేసేందుకు అటవీశాఖ అభ్యంతరాలను పరిశీలించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని పరిష్కరించాలని సూచించారు.

అనారోగ్య బాధితుడికి రూ.16వేల ఆర్థికసాయం

వైరా, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మునిసిపాలిటీ 13వ వార్డు పరిధిలో అనారోగ్యంతో బాధపడుతున్న తుమ్మా ఏకాంబరం చికిత్స నిమిత్తం 16వేల ఆర్థిక సహాయాన్ని మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ ముళ్లపాటి సీతరాములు, కాపా మురళీకృష్ణ శనివారం అందజేశారు. ఊరుకొండ శ్రీనివాసరావు, కొమిరిశెట్టి శ్రీధర్, ముళ్లపాటి రంగారావు, వెలిశెట్టి నర్సింహారావు, గంగాధర్, నర్సింహారావు, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

చీమలపాడులో పత్తిపంట మునక

కారేపల్లి ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చీమలపాడు, బాజు మల్లాయిగూడెం, పాటిమీదిగుంపు, నానునగర్‌తండా, బోటితండా, చింతల తండా, రేలకాయలపల్లి గ్రామగత ముడు రోజులుగా కురిస్తున్న భారీవర్షాలతో ఈ ప్రాంతంలోని రైతులకు సంబంధించిన పత్తి పూర్తిగా నీటమునిగింది. దీంతో రైతులకు నష్టం వాటిల్లిందని, నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని చీమలపాడు మాజీ ఎంపీపీ మాలోత్ శకుంతల, మాజీ సర్పంచ్ కిశోర్‌లు డిమాండ్ చేశారు. శనివారం వారు నీటమునిగిన పత్తి పంటను పరిశీలించారు. జిల్లా మంత్రి తుమ్మలనాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌లు పరిశీలించి, అధికారులను పంట నష్టం అంచాన వేయించాలని కోరారు.

రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

వైరా, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ-ఏపీ రాష్ట్రాలను అనుసంధానం చేసే రెబ్బవరం-నెమలి ఆర్‌అండ్‌బీ రోడ్డు అభివృద్ధికి రూ.24కోట్ల నిధులను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మంజూరు చేయాలని వైరా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు భట్టి విక్రమార్కకు నర్సిరెడ్డి సోషల్ మీడియా వేదికగా విన్నవించారు. ఆర్‌అండ్‌బీ పరిధిలోని వైరా మండలం రెబ్బవరం గ్రామం నుంచి ఖానాపురం, గన్నవరం మీదుగా ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం నెమలిలో ఉన్న శ్రీవేణుగోపాలస్వామి సన్నిధి వరకు 12కిలోమీటర్ల సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించేందుకు ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ద్వారా ఆర్‌అండ్‌బీ అధికారులు రూ.24కోట్ల నిధులకు ప్రతిపాదనలు పంపించారని తెలిపారు. ఈ ప్రతిపాదనలకు రాష్ట్ర ఆర్‌అండ్‌బీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆమోదముద్ర వేశారని అందువలన అవసరమైన నిధులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి ఏపీలో డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న భట్టి విక్రమార్క గన్నవరంలో రోడ్డు అభివృద్ధికి మంజూరు చేయించిన నిధులు మినహా

పథకాల అమల్లో పారదర్శకతకే అధిక ప్రాధాన్యం

» సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ప్రభుత్వంలో అర్హులైన అందరికీ పారదర్శకంగా పథకాల అమలు చేస్తున్నామని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. శనివారం సత్తుపల్లి పట్టణంతో పాటు మండలంలో అర్హులైన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆమె అందజేశారు. అనంతరం మండలంలోని రుద్రాక్షపల్లి, తాళ్లమడ గ్రామాలలో పర్యటించి నిర్మాణంలోని ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోవాలని, ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలని కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో చల్లగుళ్ల నరసింహారావు, తిరుమలరావు, శివా వేణు, వేంపాటి లక్ష్మీనారాయణ, భూపతిరెడ్డి, గాదె చెన్నారావు, ఎండీ.కమల్‌పాషా, కిలారి వెంకటేశ్వరరావు, దూదిపాళ్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే

గొర్రెలు, మేకల పంపిణీ పథకంలో అక్రమార్కులను శిక్షించాలి

పెనుబల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో యాదవ, గొల్లకురమల సంక్షేమానికి ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ పథకంలో అక్రమాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మామిళ్ల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీఎంపీఎస్ జనరల్‌బాడీ సమావేశం శనివారం ముత్తగూడెం గ్రామంలో జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం యాదవ, గొల్లకురమలను కోటీశ్వరులను చేస్తామని ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ పథకంలో యాదవ, కురమల కంటే ఎక్కువగా కొంతమంది పశుసంవర్థకశాఖ అధికారులు, దళారులు లాభపడ్డారని ఆరోపించారు. అవినీతిని అరికట్టాలని అనేకసార్లు తమ సంఘం విన్నవించినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. గతంలో ఏసీబీ విచారణలో రూ.700కోట్లు అవినీతి జరిగినట్లు ప్రకటించగా ప్రస్తుతం ఈడీ రూ.వెయ్యికోట్లు అవినీతి జరిగినట్లు ప్రకటించిందని, ఈ కేసులో విచారణను మరింత వేగవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాలుగా కనీసం పశువులకు నట్టలనివారణ మందును ఇవ్వడం లేదని, 50సంవత్సరాలు నిండిన పెంపకందార్లకు రూ.ఐదువేలు పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు గాయం తిరుపతిరావు, ఇమ్మడి కోటయ్య, పాశం తిరుపతిరావు, రంగయ్య, రాములు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కిషోర్

మధిర, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీలో ఇంతకు ముందు ఎన్నడూ లేని విధంగా ఒకే రోజు 43 లక్షల విలువ గల చెక్కులు పంపిణీ చేసి చరిత్ర సృష్టించామని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ అన్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సిఫార్సుతో మంజూరైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన పంపిణీ చేశారు. అనారోగ్యానికి గురై వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన మధిర పట్టణం, రూరల్ గ్రామాలకు చెందిన 78 మందికి 43.26 లక్షల రూపాయల విలువగల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కాంగ్రెస్ నాయకులు నిడమానూరి వంశీ, చావా వేణు, పాటిబండ్ల సత్యంబాబు, దుంపా వెంకటేశ్వరరెడ్డి, యన్నం కోటేశ్వరరావు, కర్నాటి రామారావు, అద్దంకి రవి, జహంగీర్, రమణ, బాబు, సంగయ్య, చక్రీ, వెంకయ్య బాబు, మాగం ప్రసాద్, తలుపుల వెంకటేశ్వర్లు, రామనాథం, డేవిడ్, రామారావు, గొల్లమండల శ్రీను, గోవింద్, వనజ, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

20.3అడుగులకు వైరా రిజర్వాయర్

వైరా, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వైరా రిజర్వాయర్ 20.3అడుగుల నీటిమట్టాన్ని దాటింది దాంతో రిజర్వాయర్ ఐదు అలుగుల నుంచి భారీ వరద నీటితో వైరా నది పరవళ్లు తొక్కుతోంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 18.3అడుగులు కాగా పరివాహక ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలతో పగిడేరు, నిమ్మవాగుల నుంచి భారీ వరదనీరు వచ్చిచేరింది. దాంతో పూర్తిస్థాయి నీటిమట్టాని కంటే రెండు అడుగుల మేర అదనపు నీరు రావడంతో వైరా నాల్గోవార్డులోని రాజీవ్‌కాలనీలోని లోతట్టు ఇళ్లు వరద నీటిలో చిక్కుకున్నాయి. వైరాలో 63.20మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వైరా నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కొన్ని గ్రామాల మధ్య రాకపోకలు నిల్చిపోయాయి. సోమవరం నల్లచెరువు పొంగి ప్రవహిస్తుండటంతో వరి పొలాలు నీటమునిగాయి. వైరా తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, ఎస్ఐ పి.రామారావు, ట్రెయినీ ఎస్ఐ వెంపటి పవన్, కమిషనర్ చింతా వేణు ముంపు ప్రాంతాల్లో పర్యటించి అప్రమత్తం చేశారు.

పంటల సర్వే నిర్వహించి పరిహారం అందజేయాలి

బోనకల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటల సర్వేను నిర్వహించి, వెంటనే ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందజేయాలని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు డిమాండ్ చేశారు. మండలంలో వర్షాలకు దెబ్బతిన్న పత్తి పొలాలను శనివారం ఆయన రైతు సంఘం నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎకరం పొలం రూ. 20 వేల నుంచి 25 వేల వరకు కౌలుకు తీసుకుని, 30 వేల పెట్టుబడులు పెట్టి పత్తి పంటను రైతులు సాగు చేశారని తెలిపారు. పంట చేతికందే తరుణంలో పూత, కాపు దశలో అకాల వర్షాలు రైతులను తీవ్రంగా నష్టపరిచాయని ఆవేదన వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించి జిల్లా వ్యాప్తంగా దెబ్బతిన్న పంటలను సర్వే చేసే విధంగా వ్యవసాయశాఖ అధికారులకు ఆదేశాలను జారీ చేయాలని కోరారు. రైతుసంఘ జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, సీపీఎం డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, పాపినేని రాంనర్సయ్య, దొండపాటి నాగేశ్వరరావు, చింతలచెర్వు కోటేశ్వరరావు, కొమ్మినేని నాగేశ్వరరావు, దొండపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

కారేపల్లిలో యూరియా కోసం రైతుల పాట్లు



కారేపల్లిలో యూరియా కోసం బారులుతీరిన రైతులు

కారేపల్లి ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియా కోసం రైతులు పడరానిపాట్లు పడుతున్నారు. స్థానిక సొసైటీ కార్యాలయంలో యూరియా కోసం తెల్లవారుజాము నుంచే రైతులు, మహిళా రైతులు గంటల కొద్ది క్యూలైన్లో ఉంటూ అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. యూరియా కొరతలేదని, నాయకులు, అధికారులు ఓవైపు చెప్పుతున్న ఇక్కడ పరిస్థితి అలా లేదు. వందలాది మంది రైతులు తమకు యూరియా కావాలని క్యూలైన్‌లో ఉంటు అవస్థలు పడుతున్నారు. ఈసందర్భంగా సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాస్‌రావు రైతులకు సరిపడా యూరియా ఇప్పంచేందుకు కృషిచేస్తున్నాడు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయి. పంటలపై యూరియా వాడకం అధికంగా ఉండడంతో రైతులు యూరియా కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాదినేని రమేష్

తల్లాడ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని వ్యవసాయ రంగానికి ప్రభుత్వం ఇచ్చే రాయితీలను కౌలు రైతులకు వర్తింపచేయాలని కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాదినేని రమేష్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక దొడ్డా కృష్ణయ్య భవనంలో సీపీఎం మండల విస్తృత సమావేశం రాజబోయిన సైదులు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రమేష్ మాట్లాడుతూ.. వ్యవసాయ ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడిచినా పంటలకు ప్రధానమైన రసాయనిక ఎరువు యూరియా సరఫరా అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని, తెలంగాణ రాష్ట్రానికి కేటాయించాల్సిన యూరియాను కేంద్ర ప్రభుత్వం అందించకుండా తెలంగాణ రైతాంగంపై వివక్ష చూపుతోందని విమర్శించారు. దేశంలో అత్యధికంగా వరి పండించే తెలంగాణ అన్నదాతలకు అన్యాయం చేస్తోందన్నారు. రాష్ట్రంలో ఉన్న 40శాతం మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడంతో యూరియా ఇతర ప్రభుత్వ పథకాలు అందడంలేదన్నారు. కౌలు రైతులు, చిన్న, సన్నకారు రైతులే అత్యధికంగా వ్యవసాయం చేయడం మూలంగా యూరియా ఇతర రసాయనిక ఎరువులు అందకపోవడంతో దిగుబడి తగ్గి నష్టపోతున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కౌలు రైతులను గుర్తించి యూరియా సరఫరా చేయాలన్నారు. యూరియా సరఫరాకు పట్టాదారు పాస్ పుస్తకం నిబంధన తొలిగించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం వర్షాకాలంలో గ్రామాల్లో విషజ్వరాలు ఎక్కువగా ఉన్నాయని గ్రామపంచాయతీలో నిధులు లేకపోవడంతో శానిటేషన్ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిని దోమలు వృద్ధి చెందుతున్నాయని, సైడ్ కాలవల్లో పూడికలు తీసి బ్లీచింగ్ చల్లించి తద్వారా ప్రజల ఆరోగ్యం కాపాడాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, నాయకులు నల్లమోతు మోహన్‌రావు, పులి కృష్ణయ్య, కళ్యాణపు కృష్ణయ్య, షేక్ నన్నేసాహెబ్, షేక్ మస్తాన్, ముచ్చింతల చెన్నయ్య, చల్లా నాగేవ్వరరావు, కట్టా దరగయ్య, మేడి బిక్షం, కర్లకుంతి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తమైన నీటిపారుదలశాఖ అధికారులు

» వరద నీటితో పంట పొలాలకు నష్టం

వైరా, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పంట పొలాల నుంచి ప్రవహించే వరదనీటిని వాగులు, వంకల్లోకి మళ్లించేందుకు నీటిపారుదలశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. వైరా రిజర్వాయర్ ఎడమకాల్వ పరిధిలోని లింగన్నపాలెం బ్రాంచ్ కెనాల్‌లో రెండునెలల కిందట నిర్మించిన సిమెంట్ గైడ్‌వాల్స్ గురువారం కురిసిన భారీ వర్షాలతో వచ్చిపడిన వరదనీటితో విప్పలమడక వద్ద వందమీటర్ల మేర కుప్పకూలింది. విప్పలమడక వీధుల్లో అలాగే పంటపొలాల నుంచి వరదనీరు ఆర్‌అండ్‌బీ రోడ్డు అడుగుభాగంలో ఉన్న తూముల నుంచి ప్రవహించడంతో ఆ తూములకు అడ్డుగా ఉన్న సిమెంట్ గోడలను నేలమట్టం చేశాయి. వెంటనే అప్రమత్తమైన నీటిపారుదలశాఖ అధికారులు ఈ సంఘటనను గుణపాఠంగా తీసుకుని యుద్ధప్రాతిపదికన వైరా కుడికాల్వలో ఆరు కిలోమీటర్ల దూరం ఈ ఏడాది నిర్మించిన సిమెంట్ గైడ్‌వాల్స్‌కు నష్టం జరుగకుండా కాల్వ గట్లకు రెండువైపులా ఉన్న పంటపొలాల్లో వరదనీటి కాల్వలను తవ్విస్తున్నారు. శనివారం నాలుగు భారీ ఎక్స్‌కవేటర్లను ఏర్పాటు చేసి యుద్ధప్రాతిపదికన ఈ వరద కాల్వలను తవ్వుతున్నారు. పొలాల్లో నుంచి వచ్చే వరదనీరు కాల్వ గట్లకు నష్టం చేయకుండా నివారించి వరదనీటిని వాగులు, వంకల్లోకి మళ్లించేందుకు కాల్వలను తవ్వుతున్నారు. నీటిపారుదలశాఖ డీఈ పి.శ్రీనివాస్, ఏఈఈ వెంకట్రాములు పర్యవేక్షిస్తున్నారు.



కుడికాల్వ పక్కన తవ్విన వరదనీటి కాల్వ



కాల్వను తవ్వుతున్న ఎక్స్‌కవేటర్